ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 242 ఆదివారం 13 సెప్టెంబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



## 'బ్రిక్స్' ఎవరికీ వ్యతిరేకం కాదు: మోదీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 12)

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోన్న సంఘర్షణలకు బ్రిక్స్ దేశాలు పరిష్కారం చూపించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. గ్లోబల్ సౌత్ దేశాలు ఇక నుంచి నిబంధనలు పాటించేవిగానే ఉండకూడదని.. ప్రపంచానికి నియమాలు నిర్దేశించేవిగా ఎదగాలని ఆకాక్షించారు. దిల్లీలోని భారత మండపం వేదికగా జరుగుతోన్న బ్రిక్స్ వార్షిక సదస్సులో ప్రారంభోపన్యాసం చేసిన ఆయన.. ఏఐ, సైబర్ స్పేస్, బయోటెక్నాలజీ రంగాల్లో సభ్యదేశాలు పరస్పరం ➤2లో



## భారీ ప్యాకేజీతో పౌల్ట్రీ రంగానికి కొత్త ఊపిరి: అచ్చెన్నాయుడు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 12)

రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు పూర్తి స్థాయి అండగా నిలిచేందుకు 'ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026--29'కు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసిన సందర్భంగా మాట్లాడిన మంత్రి... ఈ రంగం అభివృద్ధికి రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించామని వెల్లడించారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను ➤2లో

# హౌస్ హోల్డ్ మ్యాపింగ్ రద్దు



**ఇకపై కుటుంబాల్ని విడగొట్టొద్దు**
**కుటుంబం యూనిట్‌గానే పథకాల అమలు**
**కొత్త పింఛన్ల మంజూరుకు ముందే ఇది పూర్తి కావాలి**
**ప్రతి నెలా 1న సంక్షేమ దినం**

సీఎం చంద్రబాబు
కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు లోకేశ్, సత్యప్రసాద్, సీఎస్ సాయి ప్రసాద్, మంత్రి ఫరూక్
ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదు. ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు మనం ఏసీ గదుల్లో కూర్చొని వారికి పనిచేయకపోతే కడుపు కాలినవారు ఆగ్రహం చెందుతారు. జెన్‌జీలోనే కాదు.. అందరికీ ఇదే భావన కలుగుతుంది. అధికారులందరూ సహానుభూతి, మానవీయ కోణంలో పనిచేయాలి.
సీఎం చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 12)

'వైకాపా ప్రభుత్వ హయాంలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ పేరు చెప్పి అవకతవకలకు పాల్పడ్డారు. వారికి నచ్చిన వారికి పింఛన్లు, ఇళ్లు, రేషన్‌కార్డులు ఇచ్చుకునేందుకు అమలు చేసిన ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రేషన్, పింఛను, ఇళ్ల కోసం సభ్యులు కుటుంబం నుంచి విడిపోయి ప్రత్యేకంగా చూపించుకుంటున్నారన్నారు. ప్రభుత్వ విధానాలే ఇలా కుటుంబాలను విభజించేలా... చిన్న కుటుంబాలను ప్రోత్సహించేలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ➤2లో




# వైసీపీకి ఇప్పటికీ అర్థం కాని విషయం ?



(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 12)

ఏపీలో వైసీపీ ఏర్పాటు అయి 15 ఏళ్ళు అవుతోంది. ఒక వ్యక్తిగా జగన్ ఈ పార్టీని స్థాపించారు. ఆయన తన తల్లితో కలిసి ఉప ఎన్నికలను కడపలో తీసుకుని వచ్చారు. అలా జరిగిన కడప ఎంపీ, పులివెందుల ఎమ్మెల్యే ఉప ఎన్నికల్లో వైసీపీ భారీ విజయం సొంతం చేసుకుంది. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో మొత్తం 18 సీట్లకు గానూ 16 గెలిచి తన స్థానం సుస్థిరం చేసుకుంది. 2014లో అయితే అధికారం దరిదాపుల్లోకి వచ్చి మరీ బలమైన ప్రతిపక్షంగా అవిర్భవించింది. ఇక 2019 ఎన్నికల్లో అయితే 151 సీట్లతో అనూహ్యమైన తీరులో సక్సెస్ అందుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇలా వైసీపీ అన్ని దశలనూ చూసింది. ఇక వైసీపీ సంస్థాగతంగా కూడా వార్డు స్థాయి నుంచి పార్లమెంట్ వరకూ బలపడుతూ వచ్చింది. ఈ క్రమంలో అనేక మందికి పార్టీ పరంగా ప్రభుత్వ పదవుల పరంగా అవకాశాలు ఇచ్చింది.

ఎంత దగ్గరకు తీసినా :ఇక వైసీపీ అధినాయకత్వం ఒక సూత్రాన్ని పదవుల భర్తీలో అనుసరిస్తూ వచ్చింది. సామాజిక వర్గాన్ని ముఖ్యంగా పరిగణనలోకి తీసుకుంటోంది. అలాగే దానితో పాటుగా వారి విషయంలో ఎమోషనల్ టచ్ ని కూడా గమనంలోకి తీసుకుని పదవులు ఇస్తూ వచ్చింది. పార్టీ మొదటి నుంచి ఉన్నారనో లేక అధినేతకు దగ్గరగా ఉన్నారనో కారణాలు చూసి పదవులు ఇచ్చింది. ఈ విషయంలో కొందరికి మరీ ఎక్కువ చేసి పదవులు కట్టబెట్టింది. ఒకటి కంటే ఎక్కువ ➤2లో



## దేశంలోనే తొలిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం

**బీసీ రక్షణ చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్న సవిత**
**బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు చంద్రబాబుతోనే సాధ్యమని వ్యాఖ్య**
**జగన్ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసిందని విమర్శ**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 12)

బీసీల ఆత్మగౌరవ జీవనమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి సవిత స్పష్టం చేశారు. విజయవాడ సమీపంలోన ఉన్న గొల్లపూడి బీసీ భవన్‌లో నిర్వహించిన 'బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యపడుతుందని చెప్పారు.ఎన్నికల ప్రచారంలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో 'బీసీ రక్షణ చట్టం' తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. ➤2లో

## జిన్‌పింగ్ వెంటే 'అంకుల్ కై'.. భారత్‌కు వచ్చిన ఈ పొడగరి ఎవరు..?



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, సెప్టెంబర్ 12)

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌భారత పర్యటనపై సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. ఆయనతోపాటు సూటుబూటూ ధరించిన ఎత్తయిన వ్యక్తిపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. ఆయనే కై క్వి. చైనాలో 'అంకుల్ కై'గా ఫేమస్ అయిన ఆయన్ను జిన్‌పింగ్‌కు నమ్మకస్తుడు, కుడిభుజంగా చెబుతుంటారు. అధ్యక్షుడి తర్వాత శక్తిమంతమైన నేతగా చూస్తున్నారు. ఆయన ఆ స్థాయికి ఎదిగిన తీరూ చర్చనీయాంశమే..!

మామూలుగా తెరవెనక ఉండి రహస్యంగా పనులు చక్కబెట్టే కై క్వి.. కమ్యూనిస్ట్ పార్టీ పొలిటికల్ బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు. చైనా ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేసే జనరల్ ఆఫీస్ డైరెక్టర్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ కై క్వి ఎక్కువగా మీడియా కంట్లో పడుతున్నారు. గతేడాది ప్రధాని మోదీ ఎస్‌సీఓ సదస్సు కోసం చైనా వెళ్లారు. అప్పుడు వారిద్దరి మధ్య భేటీ జరగడాన్ని కీలకాంశంగా పరిగణించారు. అదే ఏడాది దక్షిణ కొరియాలో ట్రంప్-జిన్‌పింగ్ భేటీలో కూడా కనిపించారు. ఇక ఈ ఏడాది చైనా పర్యటనకు వెళ్లినప్పుడు ట్రంప్‌ను మొదట పలకరించింది కూడా ఈయనే. ➤2లో

# లోకేశ్ చేతికి వైసీపీ మీడియా!!
## పెద్ద చానల్ పై బిగ్ డీల్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 12)

అగ్రశ్రేణి తెలుగు మీడియా చానల్ పై పెద్ద డీల్ కుదిరిందనే వార్త మీడియా సర్కిల్స్ ను ఊపేస్తోంది. రెండు రోజులుగా వైరల్ అవుతున్న ఈ సమాచారంతో మంత్రి లోకేశ్ చేతికి పెద్ద చానల్ చేరిందని అంటున్నారు. ఇప్పటివరకు వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆ మీడియాను బ్యాన్ చేశారని, కానీ రెండు రోజుల క్రితం ఈ పరిస్థితి మారిపోయిందని చెబుతున్నారు. మంత్రి నారా లోకేశ్ కు అత్యంత సన్నిహితుడిగా చెబుతున్న ఒక సీనియర్ పాత్రికేయుడు ప్రముఖ టీవీ చానల్ ఎడిటోరియల్ బృందంలో కీలక బాధ్యతలు తీసుకున్నారని అంటున్నారు. గతంలో ఒక మీడియా చానల్ ను నడిపిన ఆయన కొన్నాళ్లుగా టీడీపీ సోషల్ మీడియా విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారని, ఇప్పుడు మళ్లీ మీడియా రంగంలోకి ఆయన వెళ్లడం వెనుక మంత్రి లోకేశ్ ఉన్నారని ప్రచారం జరుగుతోంది. సీనియర్ పాత్రికేయుడు ఎంట్రీతో ప్రముఖ చానల్ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ అవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో అగ్రశ్రేణి మీడియా చానల్ గా ఆ మీడియా నెట్ వర్క్ గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఆ సంస్థ యాజమాన్యం కారణంగా గత ప్రభుత్వంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిందని విమర్శలు ఎదుర్కొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సదరు మీడియా చానల్ వ్యవహారశైలిని బహిరంగంగా తప్పుపట్టేవారు. వైసీపీకి ➤2లో





## ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,సెప్టెంబర్ 12)

'రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్‌లకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పారిశ్రామిక వృద్ధిని పెంచడం, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు...ఏపీ ఎంఎస్‌ఎంఈ, ఆంత్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0(2024-29) అమలు చేస్తోంది. దీని ద్వారా 2030 నాటికి ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యం' అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి కందుల దుర్గేష్ ➤2లో

# హౌస్ హోల్డ్ మ్యాపింగ్ రద్దు

అన్ని పథకాలను కుటుంబం యూనిట్‌గా అమలు చేయాలని సూచించారు. కొత్త పింఛన్ల మంజూరుకు ముందే కుటుంబాల మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. ఆర్థిక స్థితిగతుల్ని ప్రామాణికంగా తీసుకుని క్రమబద్ధీకరించాలని, ప్రస్తుతమున్న లబ్ధిదారులను యథాతథంగా కొనసాగిస్తూనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా రెండో రోజు శుక్రవారం సూపర్‌సిక్స్ పథకాలు, సంక్షేమశాఖలపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యాంశాలివీ..

**పీ4ను ఉద్యమస్థాయిలో ముందుకు తీసుకెళ్లాలి**

ప్రతి నెలా 1వ తేదీని సంక్షేమ దినంగా నిర్వహించాలి. అదే రోజు ఉదయం పేదల సేవలో కింద పింఛన్లు అందించాలి. సాయంత్రం ప్రతి గ్రామంలో సమావేశం పెట్టి ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించాలి. దాన్ని వారి జీవన ప్రమాణాలు పెంచుకునేందుకు వినియోగించుకునేలా చూడాలి. పీ4ను మొక్కుబడిగా కాకుండా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి. ఇందుకు మంత్రులు, కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమం కింద రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెట్టాం. పింఛన్ల కోసమే రూ.75 వేల కోట్లు వెచ్చించాం. ప్రజలకు సంక్షేమాన్ని అందించి వదిలేయడం కాకుండా వారిని ఎలా సాధికారత దిశగా నడిపించాలనే దానిపై కార్యాచరణ రూపొందించాలి. అన్ని సంక్షేమశాఖలు, కార్పొరేషన్లు, సెర్ప్, మెప్మా, పీ4లను సమీకృతం చేయాలి. పిల్లలు అంగన్‌వాడీ నుంచి పాఠశాలకు, అక్కడి నుంచి ఉన్నత విద్య, ఆపై నైపుణ్య శిక్షణ పొందేలా విధానం ఉండాలి. అంగన్‌వాడీ కేంద్రాలపై పెట్టే ఖర్చుకు తగ్గట్టు దానిపై దృష్టిసారించడం లేదు.

**సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక క్యాలెండర్**

పథకాలకు సంబంధించి ప్రభుత్వం డబ్బులు వేసిందనే విషయం కూడా చాలా మందికి తెలియడం లేదు. సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక క్యాలెండర్ ప్రకటించాలి. ఏ తేదీన ఏ పథకాన్ని అమలు చేసేదీ స్పష్టంగా పేర్కొనాలి. ఎప్పటికప్పుడు సంక్షేమ పండుగలు నిర్వహించాలి. కొత్తగా ఒకటో తరగతిలో చేరే పిల్లలకు, పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్‌కు వెళ్లే విద్యార్థులకు.. ప్రత్యేక తేదీ నిర్దేశించుకుని తల్లికి వందనం సాయం విడుదల చేయాలి. చేనేత ఉత్పత్తులు తయారయ్యే ప్రతి గ్రామాన్ని ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా మార్చాలి. కుల వృత్తులు, చేతి వృత్తుల వారి నైపుణ్యాలను పెంచాలి. వారి ఉత్పత్తులకు విలువజోడించేలా కార్యాచరణ రూపొందించాలి. రాష్ట్రంలోని 19 బీసీ బాలికల వసతిగృహాలకు వీబీజీ రాంజీ పథకం కింద ప్రహరీలను వచ్చే సదస్సు నాటికి కలెక్టర్లు పూర్తి చేయాలి. వైకాపా హయాంలో సంక్షేమ వసతిగృహాల్లో జరిగినవన్నీ అవకతవకలే. ఇప్పుడు అవే నిధులతో నాణ్యమైన వస్తువుల్ని విద్యార్థులకు అందిస్తున్నాం. అన్ని శాఖలూ దీన్ని అందిపుచ్చుకోవాలి.

తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా ఉండే కాపు, బీసీ, ఇతర సామాజికవర్గాలకు చెందిన భవనాలన్నింటినీ పూర్తి చేయాలి. దీనికి తొలుత ఆయా కార్పొరేషన్లలోని మిగులు నిధుల్ని వినియోగించాలి. ఇంకా అవసరమైతే ఆర్థికశాఖకు నివేదించాలి.

**మంత్రి బలహీనంగా ఉన్నారు.. కార్యదర్శి బీద అరుపులు అరుస్తున్నారు**

వక్ఫ్ ఆస్తులన్నింటినీ పరిరక్షించి, కంప్యూటరైజ్ చేయాలి. ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి. వక్ఫ్‌బోర్డు ఆస్తుల నుంచి వచ్చే ఆదాయం తక్కువగా ఉంది. దాన్ని పెంచకుండా కలెక్టర్లకు ఆదేశాలిస్తే ఎలా? మంత్రి బలహీనంగా ఉన్నారు. కార్యదర్శి బీద అరుపులు అరుస్తున్నారు. అంతా కలిసి పనిచేసి, ఆదాయాన్ని సృష్టించాలి. సమస్యల్ని అధిగమించి మైనారిటీలకు న్యాయం చేయాలి.

**కుటుంబంలో అందరికీ 5 కిలోల చొప్పున బియ్యం**

'రేషన్‌కార్డుల అప్‌డేషన్, అప్‌గ్రేడేషన్ ఏడాదికి రెండుసార్లు మాత్రమే చేసేందుకు అవకాశముందని, కుటుంబసభ్యుల విభజన చేయకపోయినా.. కొత్తగా పెళ్లయిన జంటలకు రేషన్‌కార్డులు అందించాలి' అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సీఎం స్పందిస్తూ.. 'బియ్యం పంపిణీని 25 కిలోలకు పరిమితం చేయకుండా కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరికీ 5 కిలోల చొప్పున అందించాలి. 10 మంది కంటే ఎక్కువ ఉంటే దీనికి అదనంగా మరో కిలో బియ్యం ఇవ్వాలి' అని ఆదేశించారు.

**'ఈడబ్ల్యూఎస్'లోకి యానాటి కొండ సామాజికవర్గం**

శ్రీకాకుళం జిల్లాలోని యానాటి కొండ సామాజికవర్గం పడుతున్న ఇబ్బందులపై మంత్రి అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. సీఎం స్పందిస్తూ.. వారు ఎస్టీల్లో చేరే విషయం తేలే వరకు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్) కింద చేర్చి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.

**సమయం వృథా చేయొద్దు**

శాఖల వారీగా ప్రజంటేషన్‌కు అధికారులు ఎక్కువ సమయం తీసుకుంటుండటంతో సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సమయం వృథా కావడానికి వీల్లేదు. కలెక్టర్ల సదస్సుకు వచ్చే ముందే ఏం చెప్పాలనే దానిపై పూర్తి స్పష్టత ఉండాలి. గంటల కొద్దీ చెబుతామంటే కుదరదు. అవసరమైతే రిహార్సల్స్ చేసుకురావాలి' అని స్పష్టం చేశారు.

# 'బ్రిక్స్' ఎవరికీ వ్యతిరేకం కాదు: మోదీ

సహకరించుకోవాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో బ్రిక్స్ ప్రత్యేక గుర్తింపు పొందిందని, అయినప్పటికీ ఇది ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదన్నారు. మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు అమెరికాతోపాటు పాశ్చాత్య దేశాలకు ఓ సందేశంగా నిపుణులు భావిస్తున్నారు.

**ఐరోపా దేశాలను మేం బెదిరించట్లేదు: పుతిన్**

"బ్రిక్స్ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు పూర్తయ్యింది. ప్రజలకు మనం భరోసా కల్పించాలి. కష్టాల్లో ఉన్నప్పుడు ఉమ్మడి బాధ్యత తీసుకుందాం. ప్రస్తుతం ప్రపంచ పాలనా నిర్మాణం ఓ పిరమిడ్‌లా కనిపిస్తోంది. అధికారం, నిర్ణయాలు తీసుకోవడం అనేది శిఖర భాగంలో కేంద్రీకృతమై ఉండగా.. దిగువన ఉన్న దేశాలు ఆ నిర్ణయాల వల్ల ప్రభావితం అవుతున్నాయి. ఆ నిర్ణయాలను రూపొందించడంలో వీటి పాత్ర పెద్దగా ఉండటం లేదు.

**మొదటిపేజీ తరువాయి**

ప్రపంచ సంక్షోభాలలో ముందువరుసలో ఉన్న గ్లోబల్ సౌత్.. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మాత్రం వెనకబడి ఉంది. ఇకపై ప్రతి సభ్య దేశం భాగస్వామిగా మారి.. గళం వినిపించాలి. ఇందుకోసం చేసే ప్రతి ప్రయత్నం మానవాభివృద్ధి కోసమే ఉండాలి. వచ్చే సదస్సు నాటికి కొత్త సంస్కరణలతో సిద్ధం కావాలి. మరోవైపు ఐరాస భద్రతామండలిలో సంస్కరణలు చేపట్టాలి. ఆలస్యం చేయకూడదు. కాలానికి అనుగుణంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. పలు దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించాలి" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# భారీ ప్యాకేజీతో పౌల్ట్రీ రంగానికి కొత్త ఊపిరి: అచ్చెన్నాయుడు

పెంచడమే ఈ పాలసీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా కోళ్ల ఫారాలు, హేచరీల రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ, లో-టెన్షన్ ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు రూ.4.75 టారిఫ్ క్రమబద్ధీకరణ కల్పించామన్నారు. కొత్త ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ (జుజ) పౌల్ట్రీ షెడ్లకు రూ.25 లక్షల వరకు, పాత షెడ్ల ఆధునీకరణకు రూ.20 లక్షల వరకు 25 శాతం క్యాపిటల్ సబ్సిడీ అందించే అవకాశం కల్పించామని తెలిపారు. బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ ద్వారా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను స్థాపిస్తామన్నారు. పీపీపీ విధానంలో విజయవాడ, విశాఖపట్నం, చిత్తూరు కేంద్రాలుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్రంతో చర్చించి నూక బియ్యం సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

# వైసీపీకి ఇప్పటికీ అర్థం కాని విషయం ?

పదవులు దక్కించుకున్న వారు ఉన్నారు, వరసగా ఒకదాని తరువాత మరో పదవి అందుకున్న వారూ ఉన్నారు అని గుర్తు చేస్తున్నారు. ఇలా ఎక్కువ పదవులు దక్కించుకున్న వారే చివరికి పార్టీని వదిలి బయటకు పోతున్నారు అన్నది చాలా ఆలస్యంగా వైసీపీ గుర్తించింది అని అంటున్నారు.

**రివర్స్ లో ఉందిగా :** సాధారణంగా పార్టీలో పదవులు దక్కని వారు అసంతృప్తితో పార్టీని వీడుతారు. కానీ పదవులు దక్కిన వారు కూడా వెళ్ళిపోవడమే వైసీపీని కలవరపెడుతోంది అని అంటున్నారు. వైసీపీ 2024 ఎన్నికల్లో ఓటమి చెందాక వరసగా పార్టీని వీడిన వారి జాబితా పరిశీలిస్తే ఎవరికీ అధినాయకత్వం అన్యాయం చేయలేదని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. ఆళ్ళ నాని, మోపిదేవి వెంకటరమణ, టీడీపీ నుంచి వచ్చిన బీద మస్తాన్ రావు, బీసీ నేత ఆర్ క్రిష్ణయ్యలతో పాటు, ఎమ్మెల్సీలుగా చాన్స్ ఇచ్చిన వారు కూడా పార్టీని వీడిపోయారు అని గుర్తు చేసుకుంటున్నారు. ఇక పరాకాష్టగా విజయసాయిరెడ్డి వైసీపీని వీడడం అని అంటున్నారు. లేటెస్ట్ గా చూస్తే చిన్న శ్రీను చేతిలో నాలుగైదు పదవులు ఉండగానే వైసీపీకి గుడ్ బై చెప్పడంతో వైసీపీలో ఒక విధంగా అంతర్మథనం సాగుతోంది అని అంటున్నారు.

**మహిళల విషయంలో :** ఇక వైసీపీ మహిళా నాయకురాళ్ళ విషయం తీసుకుంటే ఎక్కువ మంది పార్టీని అట్టిపెట్టుకొని ఉన్నారని అంటున్నారు. వారికి పదవులు ఇస్తే పార్టీ కష్ట కాలమలో ఉన్నపుడు గొంతు పెంచి కూటమి ప్రభుత్వం మీద విమర్శలు చేస్తున్నారు అని గుర్తు చేసుకుంటున్నారు. మహిళా నాయకురాళ్ళలో కూడా వాసిరెడ్డి పద్మ అలాగే పోతుల సునీత గంటా పద్మశ్రీ లాంటి వారు వైసీపీని వీడినా ఎక్కువ మంది ఇప్పటికీ కలిసే ప్రయాణిస్తున్నారు అని అంటున్నారు. దాంతో వైసీపీ ఇక మీదట పార్టీ పదవుల పంపిణీలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తీవ్రంగా ఆలోచిస్తోంది అని అంటున్నారు. సమీకరణలు చూసో లేక భావోద్వేగాలతోనో పదవులు కట్టబెడితే తీరా వారు కష్టంలో ఉండక చాప చుట్టేసి పోతున్నారు అని అంటున్నారు. ఇక మీదట టీడీపీ అధినాయకత్వం మాదిరిగా ఒకటికి పది మార్లు మథింపు చేసుకుని పదవులు ఇవ్వాలని ఆలోచిస్తున్నారు. అలాగే విశ్వాసం నిబద్ధత కూడా ప్రధాన అంశాలుగా ఉండాలని యోచిస్తున్నారు. మొత్తం మీద వరసగా వైసీపీని వీడుతున్న వారిని చూస్తున్న వైసీపీ అయితే ఇక మీదట పదవుల పందేరంలో సరికొత్త సూత్రాలను అనుసరించాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. మరి పదవులు ఇచ్చే ముందు వైసీపీ ఇకనైనా తగిన చర్యలు తీసుకుంటుందా అంటే వేచి చూడాల్సి ఉంది.

# జిన్‌పింగ్ వెంటే 'అంకుల్ కై'.. భారత్‌కు వచ్చిన ఈ పొడగరి ఎవరు..?

**ఎవరీ కై క్వి..? :** 1966 నుంచి 1976 మధ్య నాటి కమ్యూనిస్ట్ పార్టీ ఛైర్మన్ మావో జెడాంగ్ ప్రారంభించిన సాంస్కృతిక విప్లవంతో జిన్‌పింగ్, కై క్వి ప్రస్థానం మొదలైంది. అప్పుడు మొదలైన వారి స్నేహం విడదీయరానిదిగా మారింది. 2013లో జిన్‌పింగ్ చైనా అధ్యక్షుడు కాగా.. 2017 నుంచి కై క్వి అతివేగంగా ఉన్నతస్థానాలకు ఎదిగారు. బీజింగ్ కమ్యూనిస్ట్ పార్టీ చీఫ్‌గా నియమితులైన కొన్ని నెలల తర్వాత నేరుగా పొలిట్ బ్యూరో (పార్టీ రెండో అత్యున్నత నిర్ణయాధికార సంస్థ) సభ్యుడిగా ప్రమోషన్ పొందారు. మామూలుగా ఇలాంటి స్థానాలకు ఎదగాలంటే కనీసం ఐదేళ్లు పడుతుంది. 2022లో పార్టీకి చెందిన ఏడుగురు సభ్యుల పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా మారారు. అత్యున్నతస్థాయి నిర్ణయాలు తీసుకునే ఒక రాజకీయ శక్తికేంద్రం అది. ఈ ఏడాది ప్రారంభంలో పార్టీకి సెంట్రల్ ఐడియాలజీ స్కూల్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఒకే వ్యక్తికి ఇన్ని పదవులంటే.. అధికారమంతా ఒక దగ్గరే కేంద్రీకృతమైందని అర్థమవుతోంది.

**'అంకుల్ కై'గా అభిమానించిన వారే..**

పాలన పాదర్శకంగా ఉండాలని పిలుపునిచ్చిన వ్యక్తి ఇన్ని పదవులు చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో చైనాలో ఫేస్‌బుక్‌ను బ్లాక్ చేయడంపై ఆయన ఫిర్యాదు చేసినట్లు సమాచారం. చైనా ట్విటర్‌గా పేరుగాంచిన వీబోలో అప్పట్లో ఆయన ఎంతో ఫేమస్. సోషల్ మీడియా వేదికగా ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేవారు. దాంతో 'అంకుల్ కై'గా ఆయన్ను ప్రజలు అభిమానించేవారు. అయితే 2014 నుంచి ఆయన స్టైల్ మారిపోయింది. పార్టీలో కీలకస్థానంలో ఎదిగిన తర్వాత వీబో ఖాతాను డిలీట్ చేశారు. 'అంకుల్ కై' కఠినంగా నిర్ణయాలు అమలు చేసే వ్యక్తిగా మారిపోయారు. "క్షేత్రస్థాయిలో నిజమైన కత్తులు తుపాకులు ఉపయోగించడం.. నేరుగా తలపడే ధైర్యం ఉండటం ముఖ్యం" అంటూ అధికారులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగాలు తీవ్ర నిరసనలకు దారితీశాయి. పొలిట్‌బ్యూరో సభ్యుడిగా నిర్ణయాలు తీసుకోవడం, విధానాల అమలును చూసుకోవడంతో పాటు సైబర్ సెక్యూరిటీ విధానాలను పర్యవేక్షిస్తున్నారు. స్వదేశంలో, విదేశంలో చైనాకు పొంచి ఉన్న ముప్పును పర్యవేక్షించే జాతీయ భద్రతా కమిషన్‌కు డిప్యూటీ హెడ్‌గా కూడా పనిచేస్తున్నారు. మావో హయాంలో వాంగ్ డాంగ్జింగ్‌ను 'గ్రేట్ సెక్రటరీ'గా పిలిచేవారు. కానీ, ప్రస్తుతం కై క్వి(ఝుఖ ాుఖ)కి ఉన్న అధికారాలు ఆయనకు లేవని రాజకీయ నిపుణులు చెబుతుంటారు. ఇదిలాఉంటే.. చైనాలో ఎవరైనా బలపడుతున్నారంటే వారి అధికారాలు కత్తిరించడం, వారిని కనుమరుగు చేయడం కొత్తేంకాదు. మరోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాలని జిన్‌పింగ్ చూస్తున్న సమయంలో కై ఎలాంటి పాత్ర పోషిస్తారో చూడాలి..!

# లోకేశ్ చేతికి వైసీపీ మీడియా!!

కొమ్ముకాస్తుందని విమర్శలు చేయడంతోపాటు తాను అధికారంలోకి వస్తే సంగతి చూస్తానని హెచ్చరికలు జారీ చేసిన సందర్భాలు ఉన్నాయని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. ఇక కూటమి అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ఆ మీడియా సంస్థ యాజమాన్యం ప్రభుత్వానికి లొంగిపోయినట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే ఆ సంస్థలోకి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సన్నిహితుడు ప్రవేశించారని, ఇకపై ఆ సంస్థ ప్రసారాలు అన్నీ ఆయన చెప్పినట్లుగానే ఉండనున్నాయని అంటున్నారు. దీంతో సదరు మీడియాలో ఇప్పటివరకు వైసీపీకి అనుకూలంగా ప్రసారమైన కథనాలు ఇకపై కొనసాగే పరిస్థితి ఉండదని సోషల్ మీడియాలో నెటిజన్లు రాస్తున్నారు. అంటే ఇప్పటివరకు వైసీపీ మీడియాగా కొనసాగిన చానల్ ఇక నుంచి టీడీపీ మీడియా పూర్తిగా రంగు మార్చుకుంటుందని కామెంట్లు చేస్తున్నారు. అంతేకాకుండా సదరు మీడియా చానల్ లోగోను కూడా పసుపు వర్ణంలోకి మార్చుతూ కొందరు ట్వీట్లు, పోస్టులు పెడుతున్నారు. మీడియా రంగంలో ఇది ఒక పెద్ద మార్పుగా అభివర్ణిస్తున్నారు. వైసీపీ అనుకూల మీడియా అంటూ ఇంతకాలం దుమ్మెత్తిపోసిన టీడీపీ సోషల్ మీడియా కూడా ఈ ప్రచారంపై స్పందించకపోవడం విశేషంగా చెబుతున్నారు. దీనిని బట్టి పెద్ద డీల్ కుదిరినట్లేనని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పరిణామంతో వైసీపీ చానల్ టీడీపీ చానల్ గా మారిపోవడం ఖాయమంటున్నారు. అంతేకాకుండా సదరు మీడియా చానల్ యాజమాన్యానికి అనుబంధంగా ఉన్న మరో ప్రముఖ చానల్ తోపాటు ఇతర వ్యాపార సంస్థలకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయాలు వెలువడుతున్నాయని కూడా ప్రచారం చేస్తున్నారు. ఏదిఏమైనా ప్రముఖ చానల్ మేనేజ్మెంట్ లోకి మంత్రి లోకేశ్ సన్నిహితుడు ఎంట్రీ ఇచ్చాడనే సమాచారం విస్తృత చర్చనీయాంశంగా మారింది.

# ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

పేర్కొన్నారు. విశాఖలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ నిర్వహిస్తోన్న 'ఎంఎస్ఎంఈ బిజినెస్ ఎక్స్‌పో-2026'ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఎంఎస్ఎంఈలు, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, స్టార్టప్ నిర్వాహకులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం ద్వారా ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

**ప్రతి నియోజకవర్గంలో ఒక మైక్రో పార్కు**

'రాష్ట్రంలో 1.75 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంలో భాగంగా...ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున మైక్రో పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సరైన సూచనలు, కన్సల్టెన్సీ సేవలు అందిస్తూ వ్యాపారాభివృద్ధికి సహకారం అందిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్ఎంఈలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న విశాఖ లాంటి నగరంలో ఇలాంటి బిజినెస్ ఎక్స్‌పోలు ఏర్పాటు చేయడం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మంచి మార్గదర్శకం లభిస్తుంది' అని దుర్గేష్ తెలిపారు. ఎక్స్‌పోలో 187 స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ ఎండీ రవి సుభాష్, ఎంపీ శ్రీభరత్, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ వైస్ ఛైర్మన్ పవన్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే తొలిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం

బీసీలను కులం లేదా వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణకు గురిచేసినా కఠిన శిక్షలు పడేలా జిల్లాల్లో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి, 2 నెలల్లోనే విచారణ పూర్తిచేసేలా పక్కా నిబంధనలు రూపొందించామని స్పష్టం చేశారు. ఈ చట్టం కోర్టులలో బలంగా నిలబడేలా 156 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకున్నామన్నారు.

గత జగన్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ద్రోహం చేసిందని మంత్రి విమర్శించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తుందని ప్రకటించారు. అంతేకాకుండా చేతివృత్తుల వారికి ఊతమిచ్చే 'ఆదరణ 3.0' పథకాన్ని కూడా త్వరలోనే అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారు.

# మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే పట్టణం పొదిలి ఒంగోలు పార్లమెంటు టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 12)

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే పట్టణం పొదిలి అని ఒంగోలు పార్లమెంటు టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్ అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్లో శనివారం సాయంత్రం నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో రసూల్ మాట్లాడుతూ



పొదిలి పట్టణంలో నిర్వహించే శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రథయాత్రను హిందూ సోదరులతో కలిసి ముస్లిం సోదరులు, మహిళలు కూడా పాల్గొంటారని చెప్పారు. అలాగే మొహరం పండుగ సందర్భంగా పీర్ల పండుగను ఘనంగా హిందూ సోదరులతో కలిసి జరుపుకుంటారని తెలిపారు. పొదిలి పట్టణంలో వినాయకచవితి పండుగను కులమతాలకు అతీతంగా జరుపుకుటు ఎంతో సంతోషంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పొదిలిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# క్విస్ కాలేజి ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ర్యాలీ

## లిటరసీ అవగాహన ర్యాలీలో పాల్గొన్న వాలంటీర్లు

## వెంగముక్కపాలెంలో అవగాహన కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

ఒంగోలులోని క్విస్ ఫార్మసీ ఎన్ సీసీ ఆధ్వర్యంలో లిటరసీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ వాలంటీర్లు స్థానిక వెంగముక్కపాలెంలో ఈ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వెంగముక్కపాలెం గ్రామస్థులకు విద్యపై అవగాహన కల్పించారు.




పిల్లలు చదివించడం ద్వారా వచ్చే లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 60 మంది ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. ఎన్ ఎస్ ఎస్ ద్వారా ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేస్తూ తమ విద్యార్థులు సమాజ సేవలో ముందు ఉన్నారని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి దేవి అన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, ఎన్ఎస్-ఎస్ పీవో డాక్టర్ అశోక్, విలేజ్ సెక్రటరీ అంజిబాబు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.








షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక
13.09.26 ఆదివారం

# ఒంగోలు జిజిహెచ్‌లో రూ.23.75 కోట్లతో నిర్మించిన అత్యాధునిక క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న 50 పడకల క్రిటికల్ కేర్ సెంటర్
## వర్చువల్ విధానంలో ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి జే పి నడ్డా, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 12)**

రాష్ట్రంలోని పేద, సామాన్య ప్రజలకు కార్పొరేట్ రంగానికి దీటుగా ఉచితంగా మెరుగైన అత్యవసర వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. శనివారం ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ప్రాంగణంలో పీఎం-ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద రూ.23.75 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను మంత్రి స్వామి, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బి ఎన్ విజయ్ కుమార్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రత్యక్షంగా ప్రారంభించారు. అంతకుముందు అమరావతి నుండి వర్చువల్ విధానం ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జే పి నడ్డా, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ క్రిటికల్ కేర్ సెంటర్లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాపాయంలో ఉన్న రోగులకు తక్షణమే అత్యున్నత స్థాయి అత్యవసర వైద్యం అందించడానికి ఈ క్రిటికల్ కేర్ సెంటర్లు ప్రారంభించడం ఒక శుభపరిణామమని తెలిపారు. ఒంగోలులో ప్రారంభించిన ఈ కేంద్రం మరో రెండు వారాల్లో ప్రజలకు పూర్తిస్థాయి వినియోగంలోకి వస్తుందని స్పష్టం చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అన్ని సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ సెంటర్ పేద ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా మారనుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు మెరుగైన వైద్యం అందించడంపైనే (తరువాయి 4లో...)



## పర్చూరులో సాకారమైన "జలసిరి"

రూ.22.02 కోట్లతో 52 గ్రామాల్లో తాగునీటి పథకాల పునరుద్ధరణ
ఏళ్లుగా నిలిచిన పథకాలకు మోక్షం
ఇంటింటికీ సురక్షిత తాగునీటికి అడుగులు
ఎమ్మెల్యే ఏలూరి నిరంతర కృషికి ఫలితం

4



## జాతీయ లోక్ అదాలత్‌లో 18,700 కేసులు పరిష్కారం



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 12)**

ప్రకాశం జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 18,700 కేసులు పరిష్కరించబడినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ సత్యానంద్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా కేసుల పరిష్కారం కోసం మొత్తం 29 బెంచీలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ బెంచీల ద్వారా 18,380 క్రిమినల్ కేసులు, 238 సివిల్ కేసులు, 3 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించబడినట్లు పేర్కొన్నారు. పరిష్కరించబడిన కేసులకు సంబంధించి కక్షిదారులకు వివిధ పరిహారాలు, అవార్డుల రూపంలో మొత్తం రూ.4.50 కోట్ల మేరకు పరిహారం అందజేయడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరంగా, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవచ్చని, ఇరుపక్షాల సమ్మతితో వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని (తరువాయి 4లో...)

## టేబుల్ టెన్నిస్‌లో భువన్ సత్తా

### గోల్డ్ మెడల్ సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన భువన్




**(షణ్ముఖ వెలుగు, మంగళగిరి, సెప్టెంబర్ 12)**




ఇటీవల కాకినాడలో సెప్టెంబర్ 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించిన టేబుల్ టెన్నిస్ స్టేట్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో మంగళగిరికి చెందిన దేవతి భువన్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. అండర్ 17 బాయ్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి స్టేట్ నంబర్ 1 గా నిలిచాడు. అంతే కాకుండా అండర్ 13 బాయ్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్, అండర్ 15 బాయ్స్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. దీంతో టోర్నమెంట్‌లో భువన్ మొత్తం మూడు పథకాలు సొంతం చేసుకుని సత్తా చాటాడు. భువన్ ఫన్ టైమ్స్ ఆర్‌వైజే నేషనల్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. చిన్న వయసులోనే (తరువాయి 4లో...)

## ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలి

అధికారులకు మంత్రి స్వామి ఆదేశం





**(షణ్ముఖ వెలుగు, కొండపి, సెప్టెంబర్ 12)**

ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని సంబందిత అధికారులను మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. శనివారం తూర్పు నాయుడుపాలెం క్యాంప్ కార్యాలయంలో కొండపి నియోజకవర్గ జలవనరులు, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగమేశ్వర ప్రాజెక్టు టెండర్ల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు, టెండర్లు పూర్తి అయ్యాయని అధికారులు మంత్రికి తెలిపారు. అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఎల్‌నినో నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలోని చెరువులన్నీ నింపి ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జలధార, జలహారతి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వెలుగొండ ఫేజ్2 లో సంగమేశ్వరం ప్రాజెక్టుకు కేటాయించిన 1.09 టీఎంసీల నీరు నింపేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని అధికారులను మంత్రి స్వామి ఆదేశించారు.

# "మన ఒంగోలు - మన గౌరవం" నినాదంతో ఒంగోలు నగరపాలక సంస్థ 150 ఏళ్ల ఘన వేడుకలు



150 ఏళ్ల చారిత్రక ప్రస్థానం పై కలెక్టరేట్‌లో
జిల్లా కలెక్టర్ పి రాజాబాబు,
ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు
విస్తృత విలేకరుల సమావేశం

4



# “మన ఒంగోలు - మన గౌరవం” నినాదంతో ఒంగోలు నగరపాలక సంస్థ 150 ఏళ్ల ఘన వేడుకలు





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 12)**

ఒంగోలు పురపాలక వ్యవస్థ ఆవిర్భవించి 150 సంవత్సరాల చారిత్రక మైలురాయిని (1876–2026) విజయవంతంగా పూర్తి చేసుకుంటున్న విశిష్ట సందర్భాన్ని పురస్కరించుకుని, నగరాన్ని సమగ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో “మన ఒంగోలు–మన గౌరవం” అనే స్ఫూర్తిదాయక నినాదంతో భారీ సేవా, పారిశుధ్య, అభివృద్ధి, సాంస్కృతిక కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ పి రాజా బాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికతో కూడిన విశేష బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు.

### పారిశుధ్య విప్లవం, మెగా ఆరోగ్య రక్షణ చర్యలు
### జిల్లా కలెక్టర్ పి రాజా బాబు

విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ ఒంగోలు 150 ఏళ్ల వేడుకలు కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా ప్రతి పౌరుడికి ప్రత్యక్ష లబ్ధి చేకూరేలా ప్రజా సేవా కార్యక్రమాలను రూపొందించామని వెల్లడించారు. ఈ సంబరాల ఆరంభంలో భాగంగా ఆదివారం నగరంలో 96, గ్రామీణ పరిధిలో 54 కలిపి మొత్తం 150 ప్రాముఖ్య ప్రాంతాల్లో రోజంతా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిసున్నామన్నారు. సుమారు 74 ప్రముఖ ప్రైవేట్ మరియు ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, డిఎంహెచ్ఓ ఆధ్వర్యంలో ఈ సేవలు అందిస్తారు. ఉచిత వైద్య, ల్యాబ్ పరీక్షలతో పాటు మందుల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ శిబిరాల్లో జనరల్ మెడిసిన్‌తో పాటు డెంటల్, ఐ, ఈఎన్‌టీ, పీడియాట్రిక్స్ (పిల్లల వైద్యం) నిపుణులు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన చెప్పారు. అలాగే నగరం నుండి రోజూ వెలువడే దాదాపు 75 మెట్రిక్ టన్నుల తడి చెత్త నిర్వహణను సవాలుగా తీసుకుని, మైక్రోబ్స్ సాంకేతికత ద్వారా నాణ్యమైన సేంద్రీయ ఎరువుగా మార్చే వినూత్న పారిశుధ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని కలెక్టర్ అన్నారు. ఈ ఎరువు నాణ్యతను రసాయన పరీక్షల ద్వారా నిర్ధారించి, ప్రత్యేక బ్రాండింగ్ రూపొందించామని. దీనిని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఇప్పటికే ఆవిష్కరించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను ఒక లాభదాయకమైన ఆర్థిక కార్యకలాపంగా తీర్చిదిద్దుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీంతో పాటు 1876లో ఒంగోలులో మున్సిపాలిటీ, చర్చి నిర్మాణం జరిగిన ఆవిర్భావ చారిత్రక నేపథ్యాన్ని ప్రతిబింబిస్తూ సత్య సెంటర్ వద్ద నాలుగు సింహాల ‘అశోక పిల్లర్’ ను సాంకేతిక–సాంస్కృతిక చిహ్నంగా ఏర్పాటు చేశామన్నారు.

### గిన్నిస్ రికార్డ్ లక్ష్యం, వారసత్వ ప్రదర్శనలు
### ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ గతాన్ని స్మరించుకోవడం మన బాధ్యత.. వర్తమానాన్ని మెరుగుపరచడం మన కర్తవ్యం భవిష్యత్తును నిర్మించడం మన సంకల్పం అనే స్ఫూర్తితో 150 ఏళ్ల వేడుకలను పండగ వాతావరణంలో రూపొందించామని చెప్పారు. ప్రజల్లో పారిశుధ్య అవగాహన పెంపొందించడం కోసం సెప్టెంబర్ 19న నగరంలోని 80,315 గృహాల నుండి కేవలం ఒకే ఒక్క గంటలో (ఉదయం 8 గంటల నుండి 9 గంటల మధ్య) తడి, పొడి చెత్తను వేర్వేరుగా వర్గీకరించి సేకరించే ‘మెగా సెగ్రిగేషన్ డ్రైవ్’ ను చేపడుతున్నామని ఆయన చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడమే ప్రధాన లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

### సెప్టెంబర్ 27న హెరిటేజ్ వాక్

నగర వారసత్వాన్ని చాటిచెబుతూ మినీ స్టేడియం నుండి భారీ ‘హెరిటేజ్ వాక్’ ప్రారంభమవుతుందన్నారు. ఈ నడకలో 3,000 మంది పౌరులు, విద్యార్థులు, యువత భాగస్వాములవుతారన్నారు. ఈ యాత్ర పొడవునా 30 విభిన్న సంప్రదాయ కళారూపాల కళాబృందాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఆయన తెలిపారు. ఇక నగర ప్రాశస్త్యాన్ని పెంచిన మహనీయుల సేవలను స్మరిస్తూ సత్య సెంటర్ వద్ద అశోక పిల్లర్‌తో పాటు 20 మంది ప్రముఖుల విగ్రహాలను పునరుద్ధరించి ఇటీవల ప్రారంభించారు. అంతేకాకుండా సినిమా, సాహిత్యం, వైద్యం, వ్యాపార, సాంకేతిక, సామాజిక రంగాలలో స్థానిక మట్టి నుండి ఎదిగి దేశ విదేశాల్లో స్థిరపడిన సీనియర్లు, డాక్టర్లు, పరిశ్రమల అధిపతులను ఉత్సవాల వేదికపై ఘనంగా ఆత్మీయ సన్మానం చేయనున్నట్లు వెల్లడించారు.

### మూడు రోజుల వైభవ ‘ఒంగోలు ఉత్సవం’

సెప్టెంబర్ 28 నుండి 30 వరకు మూడు రోజుల పాటు “ఒంగోలు ఉత్సవం” అత్యంత వైభవంగా జరగనుంది. తొలి రోజు సెప్టెంబర్ 28 ఉదయం బృహత్ పుస్తక ప్రదర్శన ప్రారంభమవుతుంది. రాత్రి వేళల్లో విశేష సాంస్కృతిక ప్రదర్శనలు, ఒంగోలుకు కీర్తి తెచ్చిన ప్రముఖులకు గౌరవ సత్కారం జరుగుతుంది. సెప్టెంబర్ 29 ఉదయం ప్రముఖ రచయితలు, పరిశోధకులతో సాహిత్య సదస్సు నిర్వహిస్తారు. రాత్రి వేళ ఒంగోలు చరిత్రను చాటే నాటకాలు, హరికథలు, విశిష్ట నృత్య రూపకాలు ఉంటాయి. ముగింపు రోజు సెప్టెంబర్ 30 ఉదయం 9 గంటలకు నెల్లూరు బస్టాండ్ ఆవరణ నుండి ఒంగోలు జాతి ప్రాశస్త్యాన్ని చాటేలా సుమారు 60 ఏళ్ల తర్వాత 50 నుండి 70 జతల (200–300 గిత్తలు) అత్యుత్తమ ఒంగోలు గిత్తలతో భారీ ఊరేగింపు, వైభవ ప్రదర్శన నిర్వహించనున్నారు. ఉత్తమ గిత్తల యజమానులకు పురస్కారాలు అందజేస్తారు. అనంతరం రాత్రి వైభవంగా ముగింపు వేడుకలు నిర్వహిస్తారు.

### ప్రజా భాగస్వామ్యానికి పిలుపు

ఒంగోలు నగరం అనేది ఏ ఒక్క అధికారిదో లేదా ప్రజాప్రతినిధిదో కాదని, నగరంలో నివసించే ప్రతి పౌరుడిదని కలెక్టర్, ఎమ్మెల్యే గుర్తుచేశారు. మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ 150 ఏళ్ల చారిత్రక పండుగలో నగర ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# టేబుల్ టెన్నిస్‌లో భువన్ సత్తా




రాష్ట్రస్థాయిలో అగ్రస్థానాన్ని సాధించడంతో భువన్‌ను పలువురు అభినందించారు. భువన్ స్థానిక వామ్ (ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ) అధ్యక్షుడు, రచ్చబండ వ్యవస్థాపకుడు దేవతి భగవన్నారాయణ మనవడు కావడం విశేషం. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన భువన్ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పలువురు ఆకాంక్షించారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 18,700 కేసులు పరిష్కారం



ఆయన పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి కృషి చేసిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ సంస్థల అధికారులు, బ్యాంకు అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ సత్యానంద్ అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమ కేసులను స్నేహపూర్వకంగా పరిష్కరించుకునేందుకు న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఒంగోలు జిజిహెచ్‌లో రూ.23.75 కోట్లతో నిర్మించిన అత్యాధునిక క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం











ప్రధానంగా దృష్టి సారించారని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఆపదలో ఉన్న అనేక పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన కూటమి ప్రభుత్వం, ఎన్టీఆర్ వైద్య సేవ, సంజీవని పథకాల ద్వారా ప్రజల ఆరోగ్యానికి పూర్తి భద్రత కల్పిస్తోందన్నారు. అత్యవసర ఔషధాలు మరియు వైద్య సరఫరాల కోసం డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తూ వైద్య రంగంలో ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టామన్నారు. గర్భిణులు, బాలింతల కోసం ‘తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్’ ద్వారా మెరుగైన రవాణా సేవలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా కొండేపి, అద్దంకి ప్రాంతాలలో నూతనంగా డయాలసిస్ కేంద్రాలను మంజూరు చేశామని వెల్లడించారు. అదే విధంగా ఆసుపత్రి వైద్యాధికారులు, ఇంజనీరింగ్ విభాగం అందించిన సాంకేతిక వివరాలను మంత్రి తెలియజేస్తూ, పీఎం–ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద 60:40 కేంద్ర–రాష్ట్ర నిధుల భాగస్వామ్యంతో రూ.23.75 కోట్ల వ్యయంతో (భవన నిర్మాణం రూ.16.63 కోట్లు, పరికరాల నిమిత్తం రూ.7.12 కోట్లు) ఈ 4 అంతస్తుల (జి+3) సముదాయాన్ని 34,906 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించినట్లు వివరించారు. ఇందులో 18 పడకల ఇంటెన్సివ్ కేర్ యూనిట్, 16 పడకల ఐసోలేషన్ వార్డులు, 10 పడకల ఎమర్జెన్సీ వార్డు, డయాలసిస్, పోస్ట్ ఓపి, మదర్–చైల్డ్ కేర్ పడకలతో సహా మొత్తం 50 పడకలు, 1 ట్రయేజ్ విభాగం ఏర్పాటు చేశామన్నారు. 2 అధునాతన ఆపరేషన్ థియేటర్లు, 2 లేబర్ డెలివరీ రూమ్‌లు, ఎక్స్–రే, అల్ట్రాసౌండ్ గదులు మరియు 20 మంది సామర్థ్యం కలిగిన 2 లిఫ్ట్‌లను ఈ భవనంలో అమర్చినట్లు వెల్లడించారు. ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోజువారీ రోగుల తాకిడి నిరంతరం పెరుగుతోందని మంత్రి తెలిపారు. 500 పడకల ఆసుపత్రి అయినప్పటికీ ప్రస్తుతం 700 మందికి పైగా ఇన్‌పేషెంట్లు, రోజుకు దాదాపు 1,600 మంది అవుట్‌పేషెంట్లు చికిత్స పొందుతున్నారన్నారు. రోగుల రద్దీని క్రమబద్ధీకరించడానికి నూతనమైన ‘స్కాన్, షేర్’ విధానం ద్వారా ఓపి వేచి ఉండే సమయాన్ని తగ్గించామని, మహిళా రోగులకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం వల్ల వైద్యశాలకు వచ్చే మహిళల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆయన చెప్పారు. రోగులకు నాణ్యమైన చికిత్స అందించేందుకు ఆసుపత్రిలో క్యాథ్ ల్యాబ్, శ్వాసకోశ వ్యాధుల నివారణకు రూ.15 లక్షల వ్యయంతో పల్మనాలజీ పరికరం, రూ.2 కోట్ల వ్యయంతో యూరాలజీ అత్యాధునిక డిజిటల్ యంత్రాలు, ఈఎన్టీ సౌండ్ ప్రూఫ్ ఆడియోమెట్రీ రూమ్, నవజాత శిశు సంరక్షణ కోసం కంగారూ మదర్ కేర్ సేవలను సమకూర్చామని ఆయన వివరించారు. అలాగే పారదర్శకత కోసం డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ రూ.23.75 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం కావడం ఒంగోలు ప్రజలకు దక్కిన గొప్ప వరమని కొనియాడారు. భవనాన్ని నాణ్యతతో వేగంగా నిర్మించిన కాంట్రాక్టర్ సంస్థ ‘మాస్టర్స్ కన్స్ట్రక్షన్స్‘ ప్రతినిధులను ఆయన అభినందించారు. త్వరలోనే జిజిహెచ్ ప్రాంగణంలోని ‘గోపీ బ్లాక్‘ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్పొరేట్ స్థాయికి ఏమాత్రం తీసిపోకుండా నిర్మించిన ఈ ఆధునిక క్రిటికల్ కేర్ సెంటర్ ద్వారా ప్రకాశం జిల్లా ప్రజలందరికీ త్వరితగతిన ఉచిత అత్యవసర వైద్య సేవలు లభించనున్నాయి.

# అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసోత్సవం



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, సెప్టెంబర్ 12)

మండల కేంద్రమైన పొన్నలూరు, చెరువుకొమ్మపాలెం అంగన్వాడి సెంటర్‌లో శనివారం పోషణ మాసోత్సవం కార్యక్రమం పై అవగాహన నిర్వహించారు. దీనిలో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వానా మాట్లాడుతూ ప్రతిరోజు తీసుకునే ఆహారం స్థానంలో పోషకాలు మెండుగా ఉండే చిరుధాన్యాలు తీసుకోవడం వలన విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజ లవణాలు లభిస్తాయన్నారు. జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలని సాంప్రదాయ, ఇంట్లో వండిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు సమతుల్య ఆహారం, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ పై అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్తలు గౌస్య, మధురవాణి, రాధా, పి కోటేశ్వరమ్మ, గర్భిణీలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పర్చూరులో సాకారమైన "జలసిరి"

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, సెప్టెంబర్ 12)

నిన్నటి వరకు బిందెడు నీటి కోసం ఎదురుచూపులు.. నేడు ఇంటింటికీ నల్లా నీటి భరోసా! ఏళ్లుగా మూలనపడిన తాగునీటి పథకాలను కదిలించి.. అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించి.. ప్రభుత్వ పెద్దల దృష్టికి సమస్యను తీసుకెళ్లి.. నిధులు మంజూరయ్యే వరకు పట్టువదలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి ఫలించింది. పర్చూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 52 గ్రామాల తాగునీటి పథకాల పునరుద్ధరణకు రూ.22.02 కోట్లు మంజూరయ్యాయి. దీంతో పల్లె ప్రజల గొంతు తడిపే జలసిరికి కొత్త బాటలు పడ్డాయి..

### నిలిచిన పథకాలకు పునర్జీవం

జల్‌జీవన్ మిషన్ కింద గతంలో మంజూరైన పలు తాగునీటి పథకాలు నిధుల కొరత, సాంకేతిక సమస్యలు, ఇతర కారణాలతో మధ్యలోనే నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే ఏలూరి నియోజకవర్గంలో ఏ గ్రామమూ తాగునీటి కోసం ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో నిలిచిపోయిన పథకాల పై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కృషి ఫలితంగానే రీస్ట్రక్చర్డ్ సింగిల్ విలేజ్ స్కీమ్‌ల కింద 52 గ్రామాల పథకాలకు నిధులు సమకూరాయి.

### ఆరు మండలాల్లో 52 గ్రామాలు

చినగంజాం, ఇంకొల్లు, కారంచేడు, యద్దనపూడి, మార్టూరు, పర్చూరు మండలాల్లోని 52 గ్రామాలకు ఈ పథకాలతో ప్రయోజనం చేకూరనుంది. ఆయా గ్రామాల్లోని హాబిటేషన్లకు తాగునీటి మౌలిక వసతులను పునరుద్ధరించి ఇంటింటికీ నల్లా నీరు అందించనున్నారు. చినగంజాం మండలంలోని కడవకుదురు, చిన గంజాం, చింతగుంపల్లి, గోనసపూడి, పెదగంజాం, సంతరావూరు, ఇంకొల్లు మండలంలోని భీమవరం, ఇడుపుల పాడు, దుద్దుకూరు, గంగవరం, ఇంకొల్లు, కొనికి, నాగండ్ల, పావులూరు, పూసపాడు గ్రామాలు ఉన్నాయి. కారంచేడు మండలంలోని ఆదిపూడి, దగ్గుబాడు, కారంచేడు, కేశవరపాడు, కొడవలివారిపాలెం, కుంకలమర్రు, స్వర్ణ, యద్దనపూడి మండలంలోని అనంతవరం, యద్దనపూడి, జగర్లమూడి, పునూరు, తనుబోడ్డువారిపాలెం గ్రామాలకూ ప్రయోజనం కలగనుంది. మార్టూరు మండలంలోని బొల్లాపల్లి, బొబ్బేపల్లి, దర్శి, ద్రోణాదుల, జొన్నతాళ్ల, కొల్లాలపూడి, కొనంకి, లక్కవరం, మార్టూరు, నాగరాజుపల్లి, రాజుపాలెం, వలపర్ల, పర్చూరు మండలంలోని అడుసుమల్లి, బోడవాడ, మందగుంట, చెన్నుభొట్లవారిపాలెం, చెరుకూరు, దేవరపల్లి, గర్నెపూడి, గొల్లపూడి, ఇనగల్లు, నూతలపాడు, పర్చూరు, రమణయపాలెం, ఉప్పుటూరు, వీరన్నపాలెం గ్రామాలు ఈ జాబితాలో ఉన్నాయి.

### రూ.22.02 కోట్లతో పనులు

నియోజకవర్గంలో 52 గ్రామాల్లో తాగునీటి మౌలిక వసతుల పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.22.02 కోట్లు మంజూరు చేసింది. నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించడంతోపాటు అవసరమైన చోట పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఇంటింటికీ నల్లా కనెక్షన్లు తదితర పనులు చేపట్టనున్నారు.

### ప్రతి ఇంటికీ నీరు' లక్ష్యంగా...

పర్చూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కొంతకాలంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే తాగునీటి వనరుల కల్పన, పథకాల పునరుద్ధరణ, కొత్త మౌలిక వసతుల ఏర్పాటుపై దృష్టి సారించారు. తాజాగా 52 గ్రామాల పథకాలకు రూ.22.02 కోట్లు మంజూరు కావడంతో ఆ దిశగా మరో కీలక అడుగు పడింది. పథకాల పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పనులు పూర్తయితే 52 గ్రామాల్లోని వేలాది కుటుంబాలకు సురక్షిత తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానుంది.

# జాతీయ లోక్ అదాలత్‌లో 1568 కేసులు పరిష్కారం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, సెప్టెంబర్ 12)

కనిగిరి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కనిగిరి కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1568, కేసులు పరిష్కారం అయినట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి రూపశ్రీ తెలిపారు. ఈసందర్భంగా క్రిమినల్ కేసులు 52, సివిల్ కేసులు 12, భరణం కేసులు 1, చెక్ బౌన్స్ కేసులు 3, ఎస్‌టిసి 1500 కేసులను ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు జడ్జి తెలిపారు.కక్షలు, వెళ్లకుండా రాజీ మార్గంలో వెళ్లి రాజ మార్గాన్ని అనుసరించాలని రాజీ మార్గమే రాజ మార్గం అని, లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరు వర్గాలు గెలిచినట్లే అని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి బి రూపశ్రీ అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు,న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లూరు నారాయణ హాస్పిటల్ డాక్టర్ అనూష, డాక్టర్ సాయి కౌషిక్‌లను ఘనంగా సత్కరించిన కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, సెప్టెంబర్ 12)

బద్వేల్ పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న అమ్మ ఫిజియోథెరపీ హాస్పిటల్‌కు శనివారం విచ్చేసిన నెల్లూరు నారాయణ హాస్పిటల్ ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ డిఆర్ అనూష, జనరల్ సర్జన్ డాక్టర్ జి సాయి కౌశిక్‌లను కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సత్కరించారు. నారాయణ హాస్పిటల్‌కు వచ్చే రోగులను ఎంతో ప్రేమ, ఆప్యాయతలతో పలకరిస్తూ, వారికి మెరుగైన వైద్యం అందించడంలో డాక్టర్ అనూష ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. ఇటీవల బద్వేల్ ప్రాంతానికి చెందిన పలువురు బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మెరుగైన న్యూరాలజీ వైద్యం అందించి కోలుకునేలా చేసినందుకుగాను, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ మాట్లాడుతూ, బద్వేల్ ప్రాంతంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు నిరంతరం సహకరించాలని కోరారు. అవసరమైన వారికి ఉచిత వైద్య సలహాలు, మందులు అందజేస్తూ పేదల పక్షాన నిలవాలని ఆకాంక్షించారు.వైద్య వృత్తిని సేవగా భావించి ముందుకు సాగుతున్న డాక్టర్ అనూష సేవలు భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే నారాయణ హాస్పిటల్ జనరల్ సర్జన్ డాక్టర్ జి సాయి కౌశిక్ కూడా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా కృషి చేయాలని జిల్లా గౌరవ అధ్యక్షులు పివిఎన్ ప్రసాద్, కే వి సుబ్బారావు కోరారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్, గౌరవ సలహాదారులు తుమ్మలపెంట సురేష్‌బాబు, ఎంప్లాయీస్ కమిటీ వైస్ చైర్మన్ పబ్బతి చక్రపాణి, జాయింట్ సెక్రటరీ పబ్బతి సత్యనారాయణ, మహిళా మండలి ప్రతినిధులు దేవతి లలిత, వల్లంకొండు ధనలక్ష్మి, చింతకుంట ధనలక్ష్మి, అమ్మ ఫిజియోథెరపీ క్లినిక్ డాక్టర్ షేక్ మహమ్మద్ జీషాన్, భీమా (బాబు), తదితరులు పాల్గొన్నారు.





# స్థానిక ఎన్నికల్లో 100 శాతం గెలుపే లక్ష్యం క్యాడర్‌కు దిశానిర్దేశం చేసిన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టెంబర్ 12)

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం విజయం సాధించడమే లక్ష్యంగా నియోజకవర్గ స్థాయి టీడీపీ క్యాడర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వ పథకాలు, వెలుగొండ జలాలు ఇవ్వడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులకు, ప్రజలకు త్రాగు నీరు, సాగునీరు అందిస్తామని రైల్వే బ్రిడ్జి నిర్మాణం త్వరలోనే పూర్తి చేసి ట్రాఫిక్ సమస్య పరిష్కారం తీరుతుంది అని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి, గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీకి ఘన విజయం అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

# 13న అర్ధవీడు మండల ముంపు గ్రామాలకు ఇళ్ల పట్టాలు, నిత్యావసరాల పంపిణీ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, సెప్టెంబర్ 12)

వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలైన అర్ధవీడు మండలంలోని కృష్ణానగర్, సాయిరాం నగర్, లక్ష్మీపురం, రామలింగేశ్వరపురం గ్రామ ప్రజలకు ఈ నెల 13 వ తేదిన ఆదివారం ఉదయం 10 గంటలకు మార్కాపురంలోని ఎస్‌వికెపి కళాశాలలో ఇళ్ల పట్టాలు, నిత్యవసర సరుకులు, చీరలు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 12)

కెసిపి సంస్థల చైర్ పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి ఎల్ ఇందిరా దత్ జన్మదిన పురస్కరించుకొని శనివారం స్థానిక వి ఎల్ దత్ ఆడిటోరియం నందు బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వారిచే క్యాన్సర్ అవగాహన, వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిబిరాన్ని కెసిపి సీనియర్ జనరల్ మేనేజర్ వి వెంకటరమణ, సమస్థితి మహిళా మండలి



చైర్మన్ వి సుశీల, రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ప్రెసిడెంట్ పఠాన్ నాగూర్ వలి, కెసిపి హెచ్‌ఆర్ ఉదయ్ కుమార్, కెసిపి హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ సభ్యులు, కార్మిక సంఘ నాయకుల చేతులు మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ శిబిరానికి విచ్చేసిన పురుషులు, మహిళలకు సంస్థ నుండి విచ్చేసిన ప్రముఖ డాక్టర్లు, వైద్య నిపుణుల సమక్షంలో ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి ఛాతి ఎక్సరే, అల్ట్రా సౌండ్ స్కానింగ్, పాప్ స్మియర్ మెమోగ్రాఫ్ వంటి పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ శిబిరం నందు సుమారు 230 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా శిబిరంనకు విచ్చేసిన వారికి క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ శిబిరం నందు పరీక్షలు నిర్వహించిన వారిలో సుమారు 8 మందికి క్యాన్సర్ వంటి లక్షణాలు ఉన్నట్లుగా గుర్తించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ హాస్పటల్ వారు ప్రత్యేక వైద్య పరీక్షల కార్యక్రమాన్ని డాక్టర్ మూడవత్ దశరథ్ చౌహాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి, వారికి కావలసిన మందులను పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమం అనంతరం విచ్చేసినటువంటి వైద్యులకు, టెక్నికల్ సిబ్బందికి కెసిపి సిమెంట్ యూనిట్ 1, రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల, సమస్థితి మహిళా మండలి సభ్యులచే ఘనంగా సన్మానించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య, రావుల వెంకట వీరాంజనేయులు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# వరికపూడిశెల పై చర్చకు సిద్ధమా పిన్నెల్లి జూలకంటి సవాల్

## స్థానిక ఎన్నికల్లో రౌడీయిజం చూపితే తాటతీస్తాం

## అభివృద్ధికి పెద్దపీట.. అరాచకంపై ఉక్కుపాదం

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టంబర్ 12)**

మీసం మెలేసి సవాల్ చేస్తున్న మాచర్ల నియోజకవర్గంలో రెండేళ్ల కూటమి పాలనకు ఐదేళ్లు సాగించిన వైసీపీ రాక్షస పాలన పై చర్చకు సిద్దామా అంటూ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పై ఎమ్మెల్యే జూలకంటి ధ్వజమెత్తారు. శనివారం నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి పై కీలక వ్యాఖ్యలు చేశారు. వరికపూడిశెల ప్రాజెక్ట్ నిర్మాణం పై అసత్య ప్రచారాలు మానుకుని, మాగాడివైతే.. నీకు దమ్ముంటే మీ హయంలో తెచ్చిన అనుమతులతో నువ్వు రా, మా ప్రభుత్వంలో మేము తీసుకొచ్చిన అనుమతులు, ఇచ్చిన నిధులతో నేను వస్తా.. రైతుల సమక్షంలో చర్చకు కుర్చుందామని తెగేసి చెప్పారు. అటవీశాఖ అనుమతులు వస్తే సరిపోవు అని, పర్యావరణ, కృష్ణా రివర్ బోర్డు, పక్క రాష్ట్రాల అంగీకార పత్రాలు, కేంద్ర జలవనరుల శాఖ అనుమతులు ఇలా అనేక అనుమతులను దాటుకుని ప్రాజెక్ట్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయని చెప్పారు. ఇప్పటికే ఫారెస్ట్ క్లియరెన్స్ కు రూ.14.05 కోట్లు.., భూ సేకరణకు రూ.63.14 కోట్ల నిధులును ప్రాధమికంగా ఖర్చు చేశామన్నారు. భూటకపు భూమి పూజలతో, శంకుస్థాపనలతో రెండు దశాబ్దాలుగా నమ్మి ఓటేసి గెలిపించిన ప్రజలను వంచించిన నీచుడెవరో అందిరికీ తెలుసన్నారు. రైతుల కోసం జూలకంటి దుర్గాంబ జెర్రివాగు లిఫ్ట్ ఇరిగేషన్ తీసుకొస్తే, వ్యాపార వనరుగా మల్చుకుని నీళ్ల అమ్ముకున్న ఘనుడివి నువ్వు కాదా పిన్నెల్లి అని ఆరోపించారు. అనుపు, కొప్పునూరు, ధర్మవరం, పేటసన్నెగండ్ల



లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ మూలన పెట్టి, కమిషన్ల కోసం కక్కుర్తిపడింది నీవు కాదా కాదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తారు. రూ.850 కోట్లతో జల్ జీవన్ మిషన్, రూ. 160 కోట్లతో అమృత్ స్కీం పథకాలు ద్వారా గ్రామీణ, పట్టణ తాగునీటికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఒక్కసారి గ్రామాల్లోకి తిరిగితే అర్థమౌతోందని పేర్కొన్నారు. మాటలతో మభ్యపెట్టడాలు, భుజాలు నిమిరి గొంతులు కొయ్యడం తనకు చేతకాదని, నవులూరి చెన్నారెడ్డిని నమిలిమింగింది ఎవరో ప్రజలందరికీ తెలుసున్నారు. కష్టపడి పని చేసిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలందరికీ తగిని న్యాయం చేస్తానని, అది నీలాంటి నీచ రాజకీయాలు చేసే వ్యక్తులు విమర్శిస్తే తాను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

**స్థానిక ఎన్నికల్లో రౌడీయిజం చూపితే తాటతీస్తాం...**

రానున్న స్థానిక ఎన్నికల్లో నియోజకవర్గంలో రౌడీయిజం చేయాలని చూస్తే తాటతీస్తామని పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, వైసీపీ నాయకులను ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి హెచ్చరించారు. రెచ్చిపోయి, ఎన్నికల్లో అలజడులు సృష్టిస్తే, చూస్తూ ఊరుకోమని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. గుండాయిజానికి వచ్చినా, రౌడీలతో వచ్చినా భయపడేదే లేదన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనే తమకు విజయం తెచ్చిపెడుతోందని ధీమా వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు, రాష్ట్ర, జాతీయ రోడ్లు , డ్రైనేజీలు, పట్టణ సివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు, విద్యా, వైద్యం వంటి వాటికి గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు కేటాయిస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతున్నామన్నారు.

**అభివృద్ధికి పెద్దపీట.. అరాచకంపై ఉక్కుపాదం...**

మాచర్ల నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తూ.. అరాచకాల పై ఉక్కుపాదం మోపుతున్నామని ఎమ్మెల్యే జూలకంటి చెప్పారు. కూటమి పార్టీలు వారు, వైసీపీ, ఇతర వర్గాలు వారు ఎవరైనా, ఎటువంటి వ్యాపారాలు చేసుకుంటున్నా వారి వద్ద నుంచి సింగిల్ పైసా కూడా కమిషన్ ను ఆశించేది లేదని పేర్కొన్నారు. మీ హయంలో ఏ విధంగా దోచుకున్నారో నిరూపితమైయ్యాయని వివరించారు. తాగు,సాగు, రోడ్లు, మౌలిక వసతుల ప్రాజెక్టుల అభివృద్ధి, ఉద్యోగం, ఉపాధి, పారిశ్రామీకరణ వంటి అనేక రంగాలకు ఊతం ఇచ్చేలా కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గంలో పాలనను సాగిస్తున్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో కూటమి పార్టీల నాయకులు పంగులూరి అంజయ్య, కజ్జం సైదయ్య, రాజబోయిన మధు, కళ్లం రామాంజిరెడ్డి, యెనుముల కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, మాచర్ల వాసు, వజ్రం నాయక్, మంజుల వెంకటేశ్వర్లు, బత్తుల అంకమ రావు, కాంతి కుమార్, లాల్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కిమ్స్ ఆసుపత్రిలో బ్రెయిన్‌డెడ్ వ్యక్తి రోశయ్య అవయవ దానం

## రోశయ్య అవయవాలతో ఐదుగురికి పునర్జీవనం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 12)**

అవయవ దానం ద్వారా పలువురికి ప్రాణదానం చేసిన మానవతా ఘటన ఒంగోలులో చోటుచేసుకుంది. నాగులుప్పలపాడు మండలం ఈదుముడి గ్రామానికి చెందిన బక్క రోశయ్య (48) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. తొలుత జీజీహెచ్‌లో చికిత్స



పొందిన ఆయనను మెరుగైన వైద్యం కోసం కిమ్స్ హాస్పిటల్స్, ఒంగోలుకు తరలించారు. వైద్యుల పరీక్షల అనంతరం ఆయన బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆసుపత్రి వైద్యులు అవయవ దానం ప్రాముఖ్యతను కుటుంబ సభ్యులకు వివరించారు. దీంతో మృతుడి భార్య సంధ్యారాణి, కుమార్తెలు అమృత, అనూహ్యతో పాటు కుటుంబ సభ్యులు కోటయ్య, బ్రహ్మయ్య, దినేష్ మహోన్నత నిర్ణయం తీసుకుని అవయవ దానానికి అంగీకరించారు. అనంతరం జీవన్‌దాన్ ద్వారా అవసరమైన అనుమతులు పొందిన తరువాత అవయవ సేకరణ ప్రక్రియను చేపట్టారు. రోశయ్య కుటుంబ సభ్యులు తీసుకున్న మానవతా నిర్ణయం ద్వారా ఐదుగురు రోగులకు పునర్జీవనం లభించే అవకాశం ఏర్పడింది. దానం చేసిన మూత్రపిండాలు, కాలేయం, కళ్లను అవసరమైన రోగులకు అందించేందుకు వైద్య బృందాలు సమన్వయంతో చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ అవయవ దానం అత్యున్నతమైన మానవతా సేవ అని అన్నారు. ప్రతి ఒక్కరూ అవయవ దానంపై అవగాహన పెంచుకుని, అవసరమైన సందర్భాల్లో ముందుకు రావాలని సూచించారు. ఎమర్జెన్సీ ఫిజీషియన్ డాక్టర్ బాల మురళీకృష్ణ మాట్లాడుతూ బ్రెయిన్‌డెత్ అనంతరం అవయవ దానం ద్వారా అనేక మందికి కొత్త జీవితం అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసుపత్రి వైద్య బృందం సమన్వయంతో అన్ని వైద్య ప్రక్రియలను సక్రమంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ డైరెక్టర్ బి ఆద్విక్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కాకునూరి అంకిరెడ్డి, రీజినల్ సీఓఓ డాక్టర్ వి ప్రవీణ్‌కుమార్, తదితరులు మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అవయవ దానానికి అంగీకరించి గొప్ప మానవతా నిర్ణయం తీసుకున్న కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అవయవ సేకరణ, మార్పిడి ప్రక్రియలో సహకరించిన కలెక్టర్, డీఎంహెచ్ఓ, ఎస్పీ, పోలీస్ శాఖ, ఫోరెన్సిక్ విభాగం, జీవన్‌దాన్, జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్, న్యూరో విభాగం అధికారులు, వైద్య సిబ్బందికి కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. రోశయ్య కుటుంబ సభ్యులు తీసుకున్న ఈ నిర్ణయం అవయవ దానం ప్రాముఖ్యతను మరోసారి చాటిచెబుతూ, సమాజానికి ఆదర్శంగా నిలిచింది.

# కూటమి హయాంలో వెలిగొండతో సస్యశ్యామలం స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రతి అభ్యర్థిని గెలిపించండి

**అభివృద్ధి సంక్షేమమే కూటం ప్రభుత్వం ధ్యేయం**
**సమావేశంలో ఎంపీ మాగుంట,**
**వైపాలెం టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు**





**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, సెప్టంబర్ 12)**

స్థానిక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బద్వీడు చెర్లోపల్లి, పోతంపల్లి గ్రామాలలో పళ్ళు సీసీ రోడ్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎర్రగొండపాలెం నియోజకవర్గం ప్రగతి పథకంలో పయనిస్తుందని ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని బి చెర్లొపల్లి–అప్రోచ్ రోడ్డు రూ.50 లక్షలు, బి చెర్లొపల్లి–చట్లమిట్ట రోడ్డు రూ.3.70 కోట్లకు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఇన్చార్జ్ ఎరిక్షన్ బాబు, నాయకులతో కలిసి రోడ్లు ప్రారంభించారు. అనంతరం రేగుమానుపల్లి–పోతంపల్లి రోడ్డు రూ.2.59 కోట్లతో నిర్మించిన పలు నూతన రోడ్లను ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అస్తవ్యస్త విధానాలతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి కుంటుపడిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో పెద్దారవీడు మండలానికి దాదాపు 20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. ఓటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా భావించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఈ సుబ్బారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ కన్వీనర్ గొట్టం శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ ఆకుమల శ్రీనివాసరెడ్డి, నాయకులు బుచ్చు వెంకటేశ్వర్‌రెడ్డి, మిల్లు కొండారెడ్డి, కర్ర శ్రీకాంత్‌రెడ్డి, తిరుపాల్ గౌడ్, బోడి రెడ్డి, వెంకట్‌రెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యంలో తల్లి బిడ్డల ప్రత్యేక ఆరోగ్య శిబిరం

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టంబర్ 12)**

తల్లి బిడ్డల ఆరోగ్యము లక్ష్యంగా రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ ఉదయ్ పిలాని ఆదేశాల మేరకు డిస్ట్రిక్ట్ డిజిగ్నేటెడ్ డే సందర్భంగా మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ సందర్భంగా శనివారం ఉదయం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు జరిగిన కార్యక్రమంలో తల్లులు, చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీల కొరకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఇన్ పేషెంట్లుగా కలిగిన 40 మంది తల్లులు, శిశువులకు పోషకాహార సలహాలు, పిల్లల సంరక్షణ పై అవగాహన కలిగించి, వారికి పోషక విలువలు కలిగిన ప్రోటీన్ పౌడర్, చిక్కీలు, పండ్లు, రొట్టెలను పంపిణీ చేయడం జరిగింది. గర్భిణీ స్త్రీలకు అవసరమైన రక్త పరీక్షలు, స్కానింగ్‌లు చేయడం జరిగింది . రంగమ్మ హాస్పటల్ వైద్యులు డాక్టర్ మూడవత్ దశరథ చౌహన్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ప్రెసిడెంట్ పఠాన్ నాగూర్ వలి మాట్లాడుతూ తల్లి, శిశు ఆరోగ్యం, పోషకాహారం పై అవగాహన పెంచడంతోపాటు అవసరమయ్యే కుటుంబాలకు ఆరోగ్య సేవలు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం అని తెలియజేశారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యంవంతమైన కుటుంబం, ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ట్రెజరర్ ఆవుల వెంకట వీరాంజనేయులు, కెపి చారి తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ కేపీ చారి ముఖ్య అతిథిగాను, హాస్పటల్ సిబ్బంది, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.








# జీవి సత్రం హైస్కూల్ ఘటన పై విచారణ వేగవంతం అధికారుల ఆకస్మిక తనిఖీ



**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టంబర్ 12)**

మైదుకూరు మండల పరిధిలోని జీవి సత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్మార్ట్ కిచెన్ ద్వారా సరఫరా చేసిన మధ్యాహ్న భోజనం కలుషితమై విద్యార్థులు అనారోగ్యానికి గురైన నిన్నటి సంఘటన విదితమే. విద్యార్థులకు వడ్డించిన పప్పులో బల్లి పడటంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. ఈ తీవ్రమైన ఘటనపై విద్యాశాఖ, రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. సంఘటన తీవ్రత దృష్ట్యా శనివారం పలువురు ఉన్నతాధికారులు పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, మైదుకూరు డిఎస్పీ రాజేంద్రప్రసాద్, అర్బన్ సిఐ రమణారెడ్డి, తహసిల్దార్ (ఎంఆర్ఓ) నరేంద్ర, మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) పాఠశాలకు చేరుకుని పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షించారు. వంటశాలను, స్మార్ట్ కిచెన్ నిర్వహణను, ఆహార నాణ్యతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల సిబ్బందిని, వంట నిర్వాహకులను ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పప్పులో బల్లి పడిన వైనంపై ప్రత్యేకంగా విచారించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహార విషయంలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని తేల్చి చెప్పారు. ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, విచారణలో ఎవరి తప్పిదం ఉన్నట్లు తేలినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇకపై ప్రతిరోజూ ఆహార నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు వడ్డించేలా పక్కా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# విద్యుత్ అధికారులను సంప్రదించిన తర్వాతే వినాయక మండపాలకు విద్యుత్ కనెక్షన్లు

**మైదుకూరు విద్యుత్ సబ్ డివిజన్ అధికారి శ్రీకాంత్ హెచ్చరిక**

**ప్రమాదాలు జరిగితే నిర్వహణ కమిటీలదే బాధ్యత**

**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టెంబర్ 12)**

వినాయక చవితి పండుగ సందర్భంగా నిర్వహించే వినాయక మండపాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని మైదుకూరు విద్యుత్ సబ్ డివిజన్ అధికారి శ్రీకాంత్ ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలకు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు ఆయన పలు సూచనలు చేశారు. మండపాలలో విద్యుత్ వినియోగిస్తున్న ప్రతీ ఒక్కరూ తక్షణమే స్పందించి, విగ్రహ వివరాలు, విద్యుత్ వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని రాతపూర్వకంగా స్థానిక విద్యుత్ అధికారికి అందించాలి. లైటింగ్, డెకరేషన్ కొరకు కేవలం నాణ్యమైన విద్యుత్ వైర్లను మాత్రమే ఉపయోగించాలి. వైర్లు జాయింట్ వేసిన చోట తప్పనిసరిగా నాణ్యమైన ఇన్సులేషన్ టేప్ ఉపయోగించాలి. టేప్ వేయకుండా వదిలేయడం ప్రమాదకరం. ఇనుప కడ్డీలు లేదా ఐరన్ పిల్లర్లకు విద్యుత్ వైర్లను నేరుగా చుట్టకూడదు. విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు పిల్లలకు అందే ఎత్తులో ఉంచకూడదు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ వాడటం లేదా చిన్నపాటి అజాగ్రత్త వల్ల ఏవైనా విద్యుత్ ప్రమాదాలు జరిగితే, దానికి సంబంధిత వినాయక ఉత్సవ కమిటీ సభ్యులనే పూర్తి బాధ్యులను చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సబ్ డివిజన్ అధికారి హెచ్చరించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న కమిటీ సభ్యులు తక్షణమే స్పందించి సహకరించాలని కోరారు.

# శెట్టివారిపల్లి చెరువుకు నీటి విడుదల నిలిపివేత

**అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్**

**తక్షణమే గేట్లు రిపేర్ చేయాలని సూచన**





**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, సెప్టెంబర్ 12)**

ఏకర్లపాలెం ఎస్ఆర్ 2 డ్యామ్ కాలువ నుంచి ఎస్ఆర్ 1 సిఎంపి కాలువను కలిపే వంక ద్వారా మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని శెట్టివారిపల్లి చెరువుకు నీటిని మళ్లించేందుకు అధికారులు పనులు చేపట్టారు. ఈ క్రమంలో 2 నుంచి చెరువును నీటితో నింపడానికి ప్రయత్నించినప్పటికీ, సాంకేతిక లోపంతో గేట్లు ఫెయిల్ కావడం వల్ల నీటి విడుదల పూర్తిగా నిలిచిపోయింది.నీరు విడుదల కాకపోవడంతో ఇబ్బంది పడుతున్న రైతులు, ఈ విషయాన్ని రైతు బాంధవుడు, మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే, వెంటనే సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. గేట్లకు ఏర్పడిన సాంకేతిక లోపాలను తక్షణమే బాగుచేసి, శెట్టివారిపల్లి చెరువుకు సజావుగా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల పంట పొలాలకు నీరందించే పనులను వేగవంతం చేయాలని, సాధ్యమైనంత త్వరగా రిపేర్ పనులు పూర్తి చేసి నీటిని చేర్చాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి ఆదేశాలు జారీ చేయడంతో నియోజకవర్గ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# మౌలాబి ఆత్మహత్యకు కారణం అధికారుల నిర్లక్ష్యం పై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి దోషాలను శిక్షించాలి

**ముస్లిం ప్రజాసంఘాల ఐక్యవేదిక**

**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, సెప్టెంబర్ 12)**

గత ఏడు నెలల క్రితం సింగరాయకొండ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో ఆరో తరగతి చదువుకునే పదకొండు ఏళ్ల పిల్లాడు అనుమానాస్పద రీతిలో చనిపోయాడు ఆ సంఘటన జరిగే పదినిమిషాల ముందు తౌషిక్ తన తల్లితో మామూలు గానే హుషారుగా మాట్లాడిన పిల్లాడు తరువాత పది నిమిషాల తరువాత పిల్లాడు ఉరివేసుకు చనిపోయాడని కందుకూరు గవర్నమెంట్ హాస్పిటల్ తరలించామని కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తెలిపారు. కోచింగ్ సెంటర్ వారితో పిల్లాడు ఉరివేసుకోవడమేందని అడిగితే నిర్లక్ష్య పూరితంగా సమాధానం ఇచ్చారు, తమ బిడ్డ చావుకు కోచింగ్ సెంటర్ నిర్వాహకులే సింగరాయకొండ పోలీసులు కేసును పక్క దారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, తౌషిక్ మరణానికి కారణమైన వారిని ఖటినగా శిక్షించాలని, కోచింగ్ సెంటర్‌లో విధులు నిర్వహించే కొంత మంది వ్యక్తులు తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకోటానికే తౌషిక్‌ని హత్య చేసారని, పిల్లాడి చావుకు కోచింగ్ సెంటర్ నిర్వాహకులే కారణమని ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి దోషాలను శిక్షించాలని పిల్లాడి తల్లిదండ్రులతో పాటు అనేక ప్రజాసంఘాలు ధర్నా చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. తన బిడ్డ చావుకు కారణమైన కోచింగ్ సెంటర్ సీజ్ చేయాలని, సరైన విచారణ జరిపి దోషాలను శిక్షించాలని సింగరాయకొండలోని చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్ ముందు గత పదిహేను రోజులుగా నిరాహారదీక్ష చేసినా ఎవరూ స్పందించలేదని పైగా కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తనను అవహేళన చేయడం, అధికారుల నిర్లక్ష్య వైఖరితో విసిగిపోయిన తనకు ఇక న్యాయం జరగదని




నిర్ణయానికి వచ్చిన మౌలాభి తనకు జరిగిన అన్యాయాన్ని, తన బిడ్డ మరణానికి బాధ్యుల వివరాలను తెలుపుతూ ఒక సెల్ఫీ వీడియో విడుదల చేసి ఆత్మహత్య చేసుకుని చనిపోయారు. ఏడు నెలల సుదీర్ఘ పోరాటం చేసి పోలీసు అధికారులు, ఎడ్యుకేషన్ అధికారుల తీరుతీనే ఇలా ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు వచ్చాయి, కనీసం ప్రజాప్రతినిధులు కల్పించుకుని న్యాయం చేస్తామని ఆ తల్లిదండ్రులకు న ధైర్యాన్ని ఇచ్చి ఉన్నా మౌలాబి ఇటువంటి నిర్ణయం తీసుకుని ఉండేది కాదని, ఒక నిరుపేద మైనారిటీ వర్గానికి చెందిన కుటుంబం కావడంతో ఏ ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోకుండా వదిలేసారని కులం బలం ముందు మైనారిటీ కుటుంబం ఓడిపోయిందని చివరకు ఆత్మహత్య చేసుకుందని ముస్లిం ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ పాపంలో భాగస్వామ్యం ఉన్న ప్రతీ ఒక్కరినీ తగిన విధంగా చర్యలు తీసుకోవాలని, తౌషిక్ కుటుంబానికి అండగా ఉండేందుకు అన్నీ విధాలుగా ప్రయత్నం చేయాలని, తౌషిక్ లాంటి పరిస్థితి మరో బిడ్డకు రాకుండా మౌలబీ లాంటి తల్లులకు న్యాయం దక్కక పోతే చివరకు ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడకూడదని, మొత్తం విషయాన్ని సిబిఐ ద్వారా విచారణ జరిపించాలని దోషాలను ఖటినంగా శిక్షించాలని ప్రకాశం జిల్లా ముస్లిం సంఘాల ఐక్యవేదిక నాయకులు పఠాన్ కరిముల్లా ఖాన్, సయ్యద్ ఇస్మాయిల్, షేక్ మహమ్మద్ రఫీ, షేక్ మహబూబ్ బాషా(బాబు), షేక్ కరిముల్లా, సయ్యద్ హుస్సేన్, షేక్ అబుల్ రవూఫ్, పఠాన్ రహమాన్ ఖాన్, తంబి శ్రీనివాసులు, కెఎఫ్ బాబు, తదితరులు డిమాండ్ చేశారు.

# పెన్షనర్లకు క్వాంటం పునరుద్ధరణ పై హర్షం

**జనవరి నుంచి అమలు చేస్తామన్న సీఎంకు రుణపడి ఉంటాం**

**పెన్షన్ల సంఘం నేతలు**




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 12)**

పెన్షనర్లకు క్వాంటం పునరుద్ధరణ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటామని పెన్షన్ల సంఘం నాయకులు తెలిపారు. శనివారం పొదిలి పెన్షనర్ల సంఘం కార్యాలయంలో షేక్ మదార్ వలి అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 70, 75 ఏళ్లు నిండిన పెన్షనర్లకు క్వాంటం పునరుద్ధరణను జనవరి 2027 నుంచి అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ పట్ల పొదిలి రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు పెన్షనర్ల భవనంలో జరిగిన సమావేశంలో సీఎం హామీని స్వాగతిస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. సహకరించిన జేఏసీ నాయకులు విద్యాసాగర్‌కి కూడా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు ఏ వీరారెడ్డి, అసోసియేటెడ్ అధ్యక్షులు డియల్ నరసింహారావు మాట్లాడుతూ మూడేళ్లుగా ఉద్యోగస్తులు, పెన్షనర్లు ఎదురుచూస్తున్న పిఆర్సి కమిటీని త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం ఆనందించదగ్గ విషయమన్నారు. కోశాధికారి చిట్టెంశెట్టి సుబ్బారావు మాట్లాడుతూ రెండు డిఎలు ఇస్తామని ప్రకటించి వెంటనే జీవోలు ఇవ్వడం పట్ల ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కీసరి శ్రీనివాస్‌రెడ్డి, ఎలమంద రెడ్డి, దాసరి గురుస్వామి, మీరావలి, మహిళా కార్యదర్శి దానమ్మ, సారమ్మ, సువర్ణమ్మ, విజయలక్ష్మి, డివి సుబ్బారావు, గోవిందయ్య, భాషా మోహిద్దీన్, మోహన్‌కృష్ణ, పురుషోత్తంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జానీ బేగ్, హుస్సేన్ ఫాచ్చా, తోట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.






# ఖాదరపల్లిలో పోలీసుల భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**9 వాహనాలు స్వాధీనం, 14 మందికి కౌన్సిలింగ్**





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, సెప్టెంబర్ 12)**

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో చాపాడు మండలం ఖాదరపల్లి గ్రామంలో పోలీసులు భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. చాపాడు, దువ్వూరు, బి.మట్టం ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బందితో కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా గ్రామంలోని పాత నేరస్థులు, అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వేటకొడవళ్లు, బాంబులు, నిషేధిత ఆయుధాల కోసం అణువణువూ గాలించారు. తనిఖీల్లో సరైన రికార్డులు లేని 9 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకు వస్తున్నాయని రికార్డులు లేని వాహనాలు కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గ్రామానికి చెందిన 14 మంది సస్పెక్ట్ షీటర్లు, రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లు, ఎర్రచందనం స్మగ్లర్లకు సీఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికల వేళ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు. గ్రామస్థులు గొడవలకు తావివ్వకుండా, పనులు చేసుకుంటూ పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలు, మహిళల భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు లేదా అనుమానితుల సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని మైదుకూరు రూరల్ సిఐ శివశంకర్ తెలిపారు.

# కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

## ఏపీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ చైర్మన్ ఏవి నాగేశ్వరావు డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 12)

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ థర్డ్ పార్టీ ఉద్యోగులు, కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని ఏపీ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని యుటిఎఫ్ ఆఫీసులో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా నాయకురాలు సిహెచ్ కళ్యాణి అధ్యక్షతన జరిగిన జిల్లా సదస్సులో ముఖ్యఅతిథిగా ఏవి నాగేశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలలో శాశ్వత పోస్టులలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులను పర్మినెంట్ చేయాలన్నారు. శాశ్వత పోస్టులలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ పద్దతిలో నియామకాలు జరపరాదని, సమానపనికి సమానవేతనం ఇవ్వాలన్న సుప్రీం కోర్టు తీర్పును ప్రభుత్వం ఖాతరు చేయటంలేదన్నారు. రాష్ట్రంలో అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా గత పది సంవత్సరాలుగా పనిచేస్తున్నటువంటి అందరిని పర్మినెంట్ చేయాలని ఇచ్చిన తీర్పుకు దిక్కు లేదన్నారు. కోర్టు తీర్పులను ఉల్లంఘిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్క రోజు కూడ పరిపాలనలో కొనసాగే నైతికహక్కులేదన్నారు. పర్మినెంట్ ఉద్యోగస్థులతో సమానంగా పనిచేస్తున్నటువంటి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు పిఆర్సి బెన్ఫిట్స్, డిఎలు, ఇంక్రిమెంట్స్, హెచ్ ఆర్ఎ, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లాంటి ప్రయోజనాలు దక్కడంలేదన్నారు. ఇటీవల పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఒరిస్సా, ఛత్తీస్గడ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలను పర్మినెంట్ చేసినప్పుడు రాష్ట్రంలో పేర్మనెంట్ చేయడానికి ఏ నిబంధనలు ప్రభుత్వానికి అడ్డు వచ్చాయని ప్రశ్నించారు. అన్ని డిపార్ట్మెంట్లో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతిలోఉద్యోగుల శ్రమ దోపిడీ చేసి కార్పోరేట్లకు ప్రజల సంపదను దోచిపెట్టే ప్రభుత్వ వైఖరి దీనికి కారణమన్నారు.కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసేలోపు తక్షణం మినిమం టైమ్ స్కేల్ అమలుచేయాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం. రమేష్ మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు రాక కుటుంబాలు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఉద్యోగభద్రత లేక నిరంతరం అభద్రతతో బ్రతుకులు వెళ్ళదీయాల్సివస్తుందన్నారు. బడ్జెట్ కొరత లేకుండా నెలనెలా వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్నిరకాల సెలవులు కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇవ్వాలన్నారు. సిఐటియు జిల్లానాయకులు సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ ప్రభుత్వం దిగివచ్చి పరిష్కారం చేసేంత వరకు ఐక్యంగా పోరాడటానికి సిద్ధంకావాలని కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పిలుపుఇచ్చారు. ఈ సదస్సులో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తాళ్ళూరి వెంకటేశ్వర్లు, కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ బాబు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి కల్పన, మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లాకార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, యన్హెచ్యం జిల్లా నాయకులు ఏడుకొండలు, ఎపి హౌసింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆదినారాయణ, అర్బన్ హెల్త్ సెంటర్స్ జిల్లానాయకులు సురేంద్ర, ఐసిడియస్ పోషణ్ అభియాన్ జిల్లా నాయకులు రాఘవ, గురుకులం సెక్యూరిటీ గార్డ్ జిల్లా నాయకురాలు పద్మలు పాల్గొన్నారు.





# కేవీ రమణారెడ్డికి అభినందనలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టంబర్ 12)

వైస్సార్సీపీ మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన కేవీ రమణారెడ్డి మండల వైసీపీ నాయకులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వైస్సార్సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్రెడ్డి ఆదేశాల మేరకు ప్రస్తుతం గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా ఉన్న కెవి రమణారెడ్డికి మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా అదనపు బాధ్యతలు కేటాయించారు. రాబోయే రోజులలో పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, సంబంధిత రీజినల్ కో–ఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారని వైస్సార్సీపీ పార్టీ కేంద్ర కార్యాలయం, తాడేపల్లి నుంచి నేడు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కేవీ రమణారెడ్డి మాట్లాడుతూ మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో వైస్సార్సీపీ పార్టీ పటిష్టతకు కృషి చేస్తాననని తెలిపారు. ఈ సందర్భంగా పొదిలి మండల వైస్సార్సీపీ నాయకులు వై వెంకటేశ్వరరావు, గొలమారి చెన్నారెడ్డి, జి శ్రీనివాసులు, కల్లం వెంకట సుబ్బారెడ్డి, షేక్ మస్తాన్ వలి, ముల్లా జాకీర్, షేక్ రియాజ్, రావులపల్లి వెంకటేశ్వర్లు, బి శ్రీనివాసరెడ్డి, బి ఓబులరెడ్డి, యక్కలి శేషగిరి, వై శ్రీను, తదితరులు పాల్గొని శాలువా కప్పి పూలమాల, పుష్పగుచ్చాలతో అభినందనలు తెలియజేశారు.

# వైన్ షాపుల లైసెన్సుల రెన్యువల్ పై ఎక్సైజ్ శాఖ స్పష్టత

## 21వ తేదీ లోపు 38 శాతం రెన్యువల్ ఫీజు చెల్లించాలి

### ఎక్సైజ్ శాఖ అధికారులు





(షణ్ముఖ వెలుగు, కంభం, సెప్టెంబర్ 12)

కంభం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 11 వైన్ షాపుల లైసెన్సీదారులతో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైన్ షాపుల లైసెన్సుల రెన్యువల్, ఫీజుల చెల్లింపు, లాటరీ ప్రక్రియ, నిబంధనల అమలు తదితర అంశాలపై లైసెన్సీదారులకు అధికారులు పూర్తి అవగాహన కల్పించారు. ప్రస్తుత వైన్ షాపుల లైసెన్సులను 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు ఒక సంవత్సరం కాలానికి రెన్యువల్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. రెన్యువల్ చేసుకోవాలనుకునే లైసెన్సీదారులు తమ లైసెన్స్ ఫీజుపై 38 శాతం రెన్యువల్ ఫీజును సెప్టెంబర్ 12 నుంచి 21వ తేదీలోపు తప్పనిసరిగా చెల్లించాలని సూచించారు. నిర్ణీత గడువులో రెన్యువల్ ఫీజు చెల్లించని షాపులకు తిరిగి టెండర్, దరఖాస్తుల ప్రక్రియ చేపడతామని అధికారులు తెలిపారు. టెండర్ ప్రక్రియలో ప్రతి దరఖాస్తుదారుడు రూ.3 లక్షల అప్లికేషన్ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో షాపునకు కనీసం నలుగురు దరఖాస్తుదారులు ఉన్నప్పుడే లాటరీ నిర్వహిస్తామని, అంతకంటే తక్కువ దరఖాస్తులు ఉంటే లాటరీ నిర్వహించకుండా నిబంధనల ప్రకారం దరఖాస్తుదారులు చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని వివరించారు. రెన్యువల్ చేసుకున్న ప్రతి లైసెన్సీదారుడు తన షాపులో నాలుగు సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పీ ధరలకే మద్యం విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించినట్లు తేలితే నిబంధనల ప్రకారం రూ.10 లక్షల వరకు జరిమానాతో పాటు ఇతర చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ నిర్దేశించిన అన్ని నిబంధనలు, లైసెన్స్ షరతులను తప్పనిసరిగా పాటిస్తూ వైన్ షాపులను నిర్వహించాలని అధికారులు లైసెన్సీదారులకు సూచించారు. సమావేశంలో పై అంశాలను లైసెన్సీదారులకు కూలంకషంగా వివరించినట్లు కంభం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ తెలిపారు.

# ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలి

## కనిగిరి డిఎస్పీ శ్రీధర్





(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టంబర్ 12)

పట్టణంలో వినాయక చవితి వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కనిగిరి సబ్ డివిజన్ డిఎస్పి శ్రీధర్ ఆకాంక్షించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం సాయంత్రం పట్టణ పుర ప్రముఖులు, మత పెద్దలతో కలిసి ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణలో ప్రజలందరూ పోలీసుశాఖకు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ నియమనిబంధనలను అతిక్రమించకుండా పండుగ వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలన్నారు. ఈ సమావేశంలో పొదిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం రాజేష్ కుమార్, ఎస్ఐ సూరెడ్డి రాజేష్, పోలీసు సిబ్బంది, పట్టణ ప్రముఖులు మీగడ ఓబుల్రెడ్డి, యక్కలి శేషగిరిరావు, షేక్ రసూల్ మహమ్మద్, దోర్నాల అంజిరెడ్డి, షేక్ జిలాని, తలమల వెంకట్రావు, షేక్ అల్లాబక్ష్, ఇతర నాయకులు, మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవ కమ్యూనిటీ భవన్ కోసం ప్రభుత్వ భూమి కేటాయింపు పై ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సానుకూల హామీ






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టంబర్ 12)

ఒంగోలు నియోజకవర్గంలో క్రైస్తవ కమ్యూనిటీ భవన్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమి కేటాయించాలని కోరుతూ ఓసీడీసీడీటి (ఒంగోలు క్రిస్టియన్ డేనామినేషనల్ చర్చస్ డెవలప్మెంట్ ట్రస్ట్) ప్రతినిధి బృందం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్రావుని కలిసి బలమైన ప్రాతినిధ్యం సమర్పించింది. ఈ సందర్భంగా ఓసిడిసిడిటి చైర్మన్ ఐజాక్ బాబు సిక్కా, జనరల్ సెక్రటరీ పాస్టర్ భగవాన్ దాస్, కమిటీ సభ్యులు యెల్లుట్ల వరుణ్ తేజ, పాస్టర్ శాంసన్, మన్నా సుదర్శన్ బాబు తదితరులు ఎమ్మెల్యేతో సమావేశమై క్రైస్తవ కమ్యూనిటీ భవన్ అవసరాన్ని వివరించారు. ఒంగోలు నియోజకవర్గంలోని 156 క్రైస్తవ డినామినేషనల్ చర్చిలు ఏకమై కమ్యూనిటీ భవన్ కోసం ప్రభుత్వ స్థలం కోరుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ భవనం కేవలం ఒక కార్యక్రమ వేదికగా కాకుండా యువత నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, ఆరోగ్య సేవలు, శిక్షణా కార్యక్రమాలు, సామాజిక సేవలు, కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడేలా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో క్రైస్తవ కమ్యూనిటీ భవనాలకు ప్రభుత్వం అందించిన భూమి మరియు సహకారానికి సంబంధించిన పలు ఉదాహరణలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ ఉదాహరణలు ఒంగోలులో కూడా క్రైస్తవ కమ్యూనిటీకి శాశ్వత మౌలిక వసతుల ఏర్పాటు అవసరాన్ని బలపరిచే అంశాలుగా వివరించారు.

**2026 సెమీ–క్రిస్మస్ కార్యక్రమానికి ప్రత్యేక హామీ**

ఈ సందర్భంగా రాబోయే 2026 డిసెంబర్ సెమీ–క్రిస్మస్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తగిన స్థలం లేక క్రైస్తవ సమాజం ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం క్రైస్తవ సమాజానికి చాలా ప్రతిష్టాత్మకమైన, అత్యంత ప్రాముఖ్యత కలిగిన కార్యక్రమం అని వివరించారు. దీని పై ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సానుకూలంగా స్పందించి, రాబోయే 2026 డిసెంబర్ సెమీ–క్రిస్మస్ కార్యక్రమాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించుకునేందుకు అవసరమైన స్థలం, అనుమతుల విషయంలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీ వల్ల ఈ ఏడాది సెమీ–క్రిస్మస్ కార్యక్రమాన్ని ఎటువంటి ఆటంకాలు లేకుండా, ప్రశాంతంగా, గౌరవప్రదంగా నిర్వహించుకునేందుకు క్రైస్తవ సమాజానికి ఎంతో ఉపశమనం లభించనుంది.

**కమ్యూనిటీ భవన్ కోసం అధికారిక ప్రాతినిధ్యం**

క్రైస్తవ కమ్యూనిటీ భవన్ కోసం తాను ఇప్పటికే జిల్లా కలెక్టర్ కి అధికారిక ప్రాతినిధ్యం అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. భూమి కేటాయింపుకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోందని, డిసెంబర్ 2027లోపు భూమి కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సానుకూల స్పందన, అధికారిక ప్రాతినిధ్యం, హామీల పై ఓసీడీసీడీటి ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. క్రైస్తవ సమాజం యొక్క దీర్ఘకాలిక అవసరాన్ని గుర్తించి, తక్షణ 2026 సెమీ–క్రిస్మస్ కార్యక్రమానికి సహకారం అందించడంతో పాటు, శాశ్వత క్రైస్తవ కమ్యూనిటీ భవన్ కోసం ప్రభుత్వ స్థల కేటాయింపు ప్రక్రియను ముందుకు తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావుకి ఓసీడీసీడీటి, ఒంగోలు క్రైస్తవ సమాజం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# లోక్ అదాలత్‌లో 1378 కేసులు పరిష్కారం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 12)

పొదిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1378 కేసులు పరిష్కరించినట్లు సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటి చైర్‌పర్సన్ ఏ ప్రత్యూష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత న్యాయస్థానం అయినటువంటి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 52 ఐపిసి కేసులు, ఎన్ఐ యాక్ట్ కేసులు 5, సివిల్ మని కేసులు 5, పర్మనెంట్ ఇంజెక్షన్ కేసులు 3, ఈపీ 10, మెయింటైన్స్ కేసులు 2, డివిసి 1, ఎస్‌టిసి కేసులు 1300 మొత్తం కలిపి 1378 కేసులు పరిక్షరించడం జరిగిందన్నారు. వీటి ద్వారా మొత్తం రూ.44,75,000 నష్ట పరిహారం కక్షిదారులకు అందించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు, కోరు కానిస్టేబుల్స్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# సీతారామ్ ఏచూరికి సిపిఎం నివాళి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 12)

సిపిఎం మాజీ జాతీయప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సభ శనివారం ఉలవపాడులోని వరికి చేను సంఘంలో సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు దువ్వూరి జాన్ అధ్యక్షతన జరిగింది. సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం రమేష్ పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యతిరేకంగా లౌకిక పార్టీలతో ఇండియా బ్లాక్ ఏర్పాటుకు మార్గదర్శి ఏచూరి అన్నారు. మతోన్మాదం దేశానికి ప్రమాదకరమన్నారు. ఆర్ఎస్ఎస్ బిజెపి ప్రజల మధ్య చిచ్చుపెట్టి, వైషమ్యాలను రెచ్చగొట్టి అధికారాన్ని శాశ్వతంగా కొనసాగించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని ఆ స్థానంలో తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. రాజ్యాంగం లేనట్లయితే ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాదాన్ని రాజ్యాంగాన్ని రక్షించుకోవటం, సమాజ మార్పు కృషి చేయడం సీతారాం ఏచూరికి ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ సభలో ఉలవపాడు ప్రాంతీయ కార్యదర్శి జీవీబీ కుమార్ మాట్లాడారు. ఎమర్జెన్సీలో ఇందిరా గాంధీని రాజీనామా చేయించిన ఘనత ఏచూరికి ఉన్నదన్నారు. అధ్యయనం, పోరాటం ఏచూరి ఆచరణలో చూపాడన్నారు. భారతదేశంలో వర్గ పోరాటానికి కుల సమస్య ఆటంకంగా మారిందని, పోరాటం చేసి నిర్మూలన కోసం కృషి చేయాలని ఏచూరి అభిప్రాయపడ్డారని తెలిపారు. పోరాటం చేయాలని కోరారు. ఈ సభలో ప్రాంతీయ కమిటీ సభ్యులు ఎస్‌డి గౌస్ భాషా, చిమటా శ్రీనివాసులు, పార్టీ నాయకులు దార్ల మాధవరావు, ఎం లలితమ్మ, కొమరగిరి శేషమ్మ, కత్తి కొండమ్మ, చిలకా శ్రీనువాసులు, దార్ల మాల్యాద్రి, డి చిన్న రామయ్య, గొల్లపోతు శివకుమార్, ఎస్‌డి జహీర్, ఎం రావు, సిపిఎం పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం కరువు ప్రణాళిక ప్రకటించాలి యుద్ధ ప్రాతిపదికన తక్షణ చర్యలు చేపట్టాలి

## కరువు పై 21 నుంచి మూడు రోజుల పాటు రైతు, వ్యవసాయ కార్మిక, వృత్తి సంఘాల ఆందోళనలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, సెప్టెంబర్ 12)

రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే సమగ్ర కరువు ప్రణాళికను ప్రకటించి, యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 21 నుంచి మూడు రోజులపాటు రైతు, వ్యవసాయ కార్మికులు, వృత్తి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. శనివారం ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పమిడి వెంకటరావు, జుజ్జూరి జయంతిబాబుతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 55 శాతం వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. దాదాపు 80 శాతం భూముల్లో విత్తనాలు వేయలేని పరిస్థితి ఏర్పడిందని, విత్తిన పంటల్లోనూ 90 శాతం వరకు ఎండిపోయే దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతటి తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం తగిన స్థాయిలో స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కరువు ప్రభావంతో రైతులు, వ్యవసాయ కార్మికులు, పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

**కరువుకు ప్రభుత్వం భాద్యత వహించాలి.....**

రాష్ట్రంలో కరువు పరిస్థితులకు ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణమని కృష్ణయ్య విమర్శించారు. మూడు, నాలుగు దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఇచ్చిన హామీలకు, చేసిన ప్రకటనలకు ఇప్పుడు జవాబు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమకు 500 టీఎంసీల నీరు, గోదావరి నుంచి 1,000 టీఎంసీల నీరు సముద్రంలో వృథాగా కలుస్తున్నట్లు ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంతటి నీటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ కరువుతో రైతులు అల్లాడటం పాలకుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. ప్రతిపాదించిన 56 చిన్న నీటి ప్రాజెక్టులపై ఎన్నోసార్లు ప్రకటనలు, శంకుస్థాపనలు జరిగినా వాటి పురోగతి ఏమిటో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రిని 'వాటర్ మ్యాన్'గా ప్రశంసిస్తూ సాగునీటి రంగంలో కొత్త పాలసీ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుకు ఉచితంగా సాగునీరు అందించబోమన్న ప్రభుత్వ వైఖరి దేశానికి అన్నం పెట్టే అన్నదాతల ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు.

**పోలవరం, వెలుగొండ నీటి పై స్పష్టత ఇవ్వాలి..**

రైతులకు సాగునీరు అందించలేని ప్రభుత్వం పోలవరం నీటిని విశాఖపట్నం వైపు ఎందుకు మళ్లిస్తోందో స్పష్టం చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. గూగుల్ డేటా సెంటర్ వంటి పారిశ్రామిక అవసరాలకు నీటి కేటాయింపులపై కూడా ప్రభుత్వం ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి సాగు, తాగునీటి అవసరాలను తీర్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన జాప్యానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని, కరువు ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ ఉపశమన చర్యలతోపాటు దీర్ఘకాలిక కరువు నివారణ ప్రణాళికను అమలు చేయాలని కోరారు.

**పంటలకు మద్దతు ధర.. ఉచిత విత్తనాలు...**

రాయలసీమలో రైతులు పండించిన పత్తి, పెసర తదితర పంటలకు ప్రభుత్వం వెంటనే మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆరుతడి పంటల సాగుకు అవసరమైన విత్తనాలను రైతులకు ఉచితంగా అందించాలని కోరారు. కరువు కారణంగా పశువులకు మేత, నీటి కొరత తీవ్రంగా ఏర్పడిందన్నారు. రాయలసీమలో గొర్రెలు, మేకలు తాగునీరు, మేత కోసం 50 కిలోమీటర్ల వరకు తరలివెళ్లాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మూగజీవాలకు తాగునీరు, మేత అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**కరువు ఉన్నంతకాలం ఉపాధి పనులు....**

బాపట్ల జిల్లాలోని 15 గ్రామాల్లో తమ సంఘం పరిశీలన జరిపిందని, వ్యవసాయ కార్మికులకు పనులు కల్పించడంలో తీవ్ర ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించామని కృష్ణయ్య తెలిపారు. కరువు పరిస్థితులు కొనసాగినంతకాలం వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

**రైతు రుణాలు రద్దు చేయాలి.....**

రైతుల రుణాలను తక్షణమే రద్దు చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తున్న ప్రభుత్వాలు దేశానికి అన్నం పెట్టే రైతుల రుణాల విషయంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నాయని ప్రశ్నించారు. 'అదానీ, అంబానీలే దేశానికి అవసరమా? అన్నదాతలు అవసరం లేదా?' అని నిలదీశారు. పొగాకు గిట్టుబాటు ధర విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఐటీసీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యవసాయ విద్యుత్ మీటర్లను వ్యతిరేకించి విశాఖపట్నంలో కేసు వేసిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే సంస్థకు రూ.2,500 కోట్లు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. ఈ అంశంపై అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

**22ఏ భూముల సమస్య పరిష్కరించాలి....**

రాష్ట్రంలో 22-ఏ కింద లక్షల ఎకరాలను నిషేధిత భూముల జాబితాలో చేర్చారని కృష్ణయ్య విమర్శించారు. ఈ సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి రైతులకు భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కరువు నివారణ చర్యలపై ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రకటించాలని, రైతులు, వ్యవసాయ కార్మికులు, పశుపోషకులను ఆదుకునేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. లేనిపక్షంలో ఈ నెల 21 నుంచి మూడు రోజులపాటు చేపట్టనున్న ఆందోళనలను రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని కృష్ణయ్య హెచ్చరించారు.

# తౌషిక్, మౌలాబి చావుకు కారకులైన రమణారెడ్డి ముఠాను అరెస్టు చేయాలి

## ప్రకాశం జిల్లా డీఈవో రేణుక ను సస్పెండ్ చేయాలి తౌషిక్ మౌలాబి కుటుంబానికి 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి జిల్లా కలెక్టర్‌ను కలిసి కోరిన దళిత నేత నీలం






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 12)

సింగరాయకొండ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్ చంపబడిన తౌషిక్, ప్రభుత్వ అలసత్వంతో బలవన్మరణం పొందిన మౌలాబి ఘటనలో కారకులైన రమణ రెడ్డి ముఠాను అరెస్టు చేయాలని వీరి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు జిల్లా కలెక్టర్ రాజాబాబును కలిసి కోరారు. శనివారం కలెక్టరేట్ ముందు సింగరాయకొండలో చంపబడిన తౌషిక్ ఘటనలో ప్రభుత్వ అలసత్వానికి నిరసనగా ఆత్మహత్య చేసుకున్న హతుని తల్లి మౌలాబి అమానుష మరణం పై పివి రావు మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 14న కనిగిరికి చెందిన తౌషిక్ సింగరాయకొండ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో చదువుతూ చంపబడ్డారన్నారు. కాలేజీ యాజమాన్యం రమణారెడ్డి, చైతన్య, బాబ్జి ఆత్మహత్య కింద చిత్రీకరించారన్నారు. ఈ అమానుష బాలుని హత్యపై అప్పటినుండి వారి తల్లిదండ్రులు ఆందోళన చేస్తూనే ఉన్నారన్నారు. హైకోర్టులో కూడా న్యాయం జరగలేదని పిటిషన్ కేసు వేశారన్నారు. సింగరాయకొండ ఎస్ఐ మహేంద్రను బదిలీ చేసి నెల్లూరు అడిషనల్ ఎస్పీ కి ఈ కేసు విచారణకు విచారన్నారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు త్రీ మెన్ కమిటీ నియమించగా డిఇఓ రేణుక సదరు స్కూలుకు ప్రభుత్వ అనుమతి లేదని విచారించిందన్నారు. కానీ ఒంగోలు తెలుగుదేశం ఎంపీ మాగుంట, సత్య కనుసన్నల్లో ప్రభుత్వ అనుమతి నిషేధించిన మరలా చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్ వారు యధావిధిగా కోచింగ్ సెంటర్ నడుపుతున్నారన్నారు. బిడ్డను కోల్పోయి మనస్తాపం చెందిన తౌషిక్ తల్లి మౌలాబి స్కూలు మూసివేయాలని ఈనెల 10వ తేదీ నుండి నిరాహార దీక్ష చేస్తుందన్నారు. ఈ మధ్యలో ముఖ్యమంత్రి ఎక్కడ మీటింగ్ పెట్టిన మౌలాబి ఆ సభలో ఆందోళన చేసిందన్నారు. పోలీస్ వేధింపులు కూడా మౌలాభి కుటుంబానికి ఎక్కువ అయ్యాయి అన్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయకపోవడంతో అధికారులు ఎవరు పరామర్శించకపోవడంతో మనస్థాపం చెంది మౌలాబి శుక్రవారం సింగరాయకొండ పోలీస్ స్టేషన్ ముందు గడ్డి మందు తాగి శనివారం ఉదయం హైదరాబాదు లో మరణించింది అన్నారు. మైనార్టీ కుటుంబం మరణ మృదంగం కూటమి ప్రభుత్వ స్థానిక మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి కి వినపడలేదన్నారు. అంతట పివి రావు మాల మహానాడు ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ముందు తౌషిక్, మౌలాబి కుటుంబానికి 50 లక్షలు ఎక్స్రేషియా ఇవ్వాలని చైతన్య నవోదయ కాలేజీ రమణారెడ్డి, చైతన్య, బాబ్జి లను అరెస్టు చేయాలని వారితో కుమ్మక్కైన ప్రకాశం జిల్లా డీఈవో రేణుక ను సస్పెండ్ చేయాలని మైనార్టీ కార్పొరేషన్ ద్వారా బాధిత కుటుంబానికి 5 లక్షలు మరియు 4 ఎకరాల భూమి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాజాబాబును దళిత నాయకులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశాడు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తన డిమాండ్ల సాధనకు రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. కలెక్టర్ ను కలిసిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా, వీసీకే పార్టీ జిల్లా అధ్యక్షులు ఆదినారాయణ, కాకుమాను రవి, పత్రా బంగారం, మేడికొండ మురళి తదితరులు ఉన్నారు.

